శ్రీ దత్త దత్తావతారులు గురుదత్త

# శ్రీ మాణిక ప్రభువులవారి చరిత్ర

## గురుపూర్ణిమ కానుక



శ్రీ దత్త  దత్తావతారులు  గురుదత్త

# శ్రీ మాణిక ప్రభువులవారి చరిత్ర

## గురుపూర్ణిమ కానుక



శ్రీ దత్త భగవానుని సేవలో


చిలుకూరు బాలకృష్ణమూర్తి

శ్రీమతి భవాని

కృష్ణలంక

విజయవాడ-13





## విషయ సూచిక

1. తొలిపలుకు
2. శ్రీ దత్తసేవ శివసేవయే
3. శ్రీ దత్త దివ్యవాణి - బ్రహ్మజ్ఞానము.
4. శ్రీ మాణిక ప్రభువులవారి చరిత్ర
5. స్వామి సేవలో పాల్గొనమని ఆదేశించుట.
6. శ్రీ దత్తస్తుతిగీతం

## విన్నపము

శ్రీ దత్త ప్రభువులు వచించిన "శ్రీ దత్త గురు భగవద్గీత" అచ్చు వేయవలసి యున్నది. భక్త మహాశయులు వారికి తోచిన గురుదక్షిణ సమర్పించి శ్రీ దత్త సేవలో పాల్గొన వినతి. రు. 101/- గురుదక్షిణ నగదు M O./D.D. ద్వారా సమర్పించినవారికి "శ్రీదత్తగురు భగవద్గీత" అచ్చు వేయగానే పంపబడును.

ఇట్లు
శ్రీ దత్త సేవలో

చిలుకూరు బాల కృష్ణమూర్తి
శ్రీమతి భవాని
41-15-4, నల్లగేటు డౌన్
కృష్ణలంక, విజయవాడ-13
ఫోన్ : 521809



# దత్తావతారులు

## శ్రీ మాణిక ప్రభువుల చరిత్ర

## తొలి పలుకు

### శ్రీ గురుదత్త

వేదమాత ఊహకు సైతము అందని విషయములను తెలుపుచున్నది. కాన వేదమే వరమ ప్రమాణము. ఈ యజ్ఞము చేసిన ఈ ఫలము వచ్చును అని వేదమే చెప్పుచున్నది. స్వర్గాది లోకప్రాప్తి, ఇహలోక భాగ్యములైన ఆయురారోగ్య ఐశ్వర్యాదులు యజ్ఞములు చేయుట వలన కలుగుచున్నవి. కనుక వేదము ఊహాతీతమగు విషయములో పరమ ప్రమాణము. వేదమాత బ్రహ్మమును గురించి ఏమని చెప్పుచున్నది? దేనినుండి ఈ పంచభూతములు (ఆకాశ-వాయు-అగ్ని-జల-పృథివి) సృష్టించబడి, దేనిచేత జీవించి, దేనియందు లయించుచున్నవో అదే బ్రహ్మము అని వేదమాత వచించుచున్నది. ఇక వేదమును అనుసరించిన బ్రహ్మసూత్రాలు

ఏమని చెప్పుచున్నవి? "బ్రహ్మ చర్చను" చేస్తామని మొదటి సూత్రములోను, "ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములు దేనినుండి జరుగుచున్నవో, అదే బ్రహ్మము" అని రెండవ సూత్రములో చెప్పినవి. ఇక భగవద్గీత ఏమి చెప్పుచున్నది? "నేను సర్వ జగత్తునకు ప్రభవము-ప్రళయము" దారములో గ్రుచ్చబడిన మణులవలె, ఈ జగత్తంతయును నా యందు నిలిచియున్నది" అని భగవద్గీతలో వాసుదేవుడు సెలవిచ్చెను. వేదము (ఉపనిషత్తులు)-బ్రహ్మ సూత్రములు-భగవద్గీత-ఈ మూడును బ్రహ్మముచే సాక్షాత్తుగా చెప్పబడినవి. కాన బ్రహ్మము విషయములో పరమ ప్రమాణములు-ఇవే పవిత్ర ములగు ప్రస్థానత్రయ గ్రంథములు.

కనుక సారాంశమేమనగా-

1] బ్రహ్మము ఒక్క వస్తువే. ఒక్క స్వరూపమే. రెండు కాదు. మూడుకాదు.

2] బ్రహ్మమే జగత్తుకు మూల కారణములగు పంచ భూతములను సృష్టించి, ధరించి, లయింప చేయుచున్నది.

ఈ వేద నిర్వచనములోని రెండు ముఖ్యాంశాలు ఎవరిలో సమన్వయమగుచున్నవో, అదే పరబ్రహ్మము అని రూఢి అయినది గదా. ఆ పరబ్రహ్మమెవరు? శ్రీ దత్త భగవానుడే ఆ పరబ్రహ్మము. ఎట్లు?

1. దత్తుడొక్క వ్యక్తియే కాన బ్రహ్మము ఒక్కటియే అను అంశము నిరూపితమైనది.

2. జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయములను తన మూడు ముఖముల ద్వారా చేయుట ప్రత్యక్షంగా నిరూపణమగు చున్నది గదా.

అనగా ఒకే బ్రహ్మము జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ ములను చేయుచున్నది అను వేదోక్త బ్రహ్మ నిర్వచనము ఈ రూపంలో పరిపూర్ణంగా నేరుగా, ప్రత్యక్షంగా, సమన్వయ మగుచుండుటచే శ్రీ దత్తప్రభువే పరబ్రహ్మము.

జగత్తుయొక్క నామ రూపములను సృష్టించు బ్రహ్మ దేవుని, వాటిని నిలుపు విష్ణుదేవుని, వాటిని లయింపచేయు శివదేవుని—ఈ ముగ్గురిని ఒక్కచోట నిలిపి, ఈ ముగ్గురు కలిపి బ్రహ్మము అనుటకు వీలులేదు. బ్రహ్మము అనునది ఒకే ఒక స్వరూపము. ఒకే వ్యక్తి. ముగ్గురి పంక్తి కాదు. శ్రీ దత్త భగవానుని చిత్రపటము చూచెదము గాక. స్వామి త్రిముఖము లతో, షడ్భుజములతో ఒప్పుచున్నాడు. మొదటి ముఖము హిరణ్యగర్భుడు, మధ్య ముఖము నారాయణుడు, మూడవ ముఖము సదాశివుడు. సృష్టి, స్థితి, లయముల చేయు మూడు ముఖములు ఒకే వ్యక్తి. శంఖ, చక్రములు పై రెండు హస్తముల యందు, ఢమరుక త్రిశూలములు మధ్య రెండు హస్తముల యందు, అక్షమాల కమండలము క్రింది రెండు హస్తములలో కన్పట్టుచున్నవి గదా. ధర్మదేవతయే స్వామిని గో రూపమున ఆశ్రయించియున్నది. నాలుగు వేదములే నాగులు శునకము లుగా స్వామిని ఆశ్రయించియున్నవి. యమధర్మరాజే ధర్మ దేవత. సనక, సనందన, సనాతన, సనత్కుమారులే శునక రూపమున స్వామిని సేవించుచున్నారు. శ్రీ దత్త ప్రభువు వర్తమానములో విష్ణు స్వరూపము. కనుక మధ్య ముఖము విష్ణువు. పీతాంబరధారి. కాషాయమేఖల ధరించినారు. మెడలో వనమాల స్ఫటికమాల, రుద్రాక్షలు ధరించినారు. శ్రీ దత్త భగవానుడే పరబ్రహ్మము. స్వామి త్రిమూర్త్యాత్మకుడు. సర్వ శక్తి సంపన్నుడు. స్మర్తృగామి. అనగా పిలవగనే పలికేవాడు. కరుణాసముద్రుడు. స్వామి విశ్వవ్యాపి. స్వామి-ధర్మమును ఉద్ధరించుటకు, అధర్మమును దండించుటకు ప్రతిక్షణము అవతరించును. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇట్టి అవతారములే.

శ్రీ దత్త ప్రభువు కలియుగమునందు ఆరు అవతారములు దాల్చెను. శ్రీ పాద శ్రీ వల్లభుడు, నరసింహ సరస్వతి, మాణిక ప్రభువు, అక్కలకోట మహారాజు, శిరిడి సాయి నాధుడు, సత్య సాయిబాబావారు శ్రీ దత్తావతారులే. వర్తమాన దత్తావతారులే శ్రీ సత్యసాయిబాబావారు. బ్రహ్మ, విష్ణు, శివ శబ్దములు మూడు సందర్భోచితములగు అర్థములను అందించు రసపాత్రల వంటివి. కాన ఇందులో ఒకరు అధికులు, మరొకరు తక్కువవారని భ్రమపడరాదు. శివకేశవద్వయమైన ప్రకృతి రూపాన్ని బ్రహ్మమైన స్వామి ఆవేశించినపుడు అవతారమౌతుంది. సామాన్య మానవునిలో శివ (పరా) కేశవుడు (అపరా) ఇరువురే వుందురు. కాని అవతారములో శివ-కేశవ-బ్రహ్మలున్నారు. ఇదే అవతారమునకు—సామాన్య మానవునకు తేడా. స్వామి అవతరించినపుడు విచిత్రములైన సిద్ధులను ప్రదర్శించి, తన భగవతత్త్వమును ప్రదర్శించి నాస్తికులను ఆస్తికులుగా మార్చెదరు. ఆ తరువాత గురు స్వరూపముతో జ్ఞానమును బోధించి, ఆస్తికుని లక్ష్యమువద్దకు సకాలములో చేర్చెదరు. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు' గురువే మహేశ్వరుడు, గురువు సాక్షాత్తు పరబ్రహ్మము అట్టి గురుదేవులకు నమస్కరించి, సేవించి, తరించవలెను.

శ్లో॥ న గురోరధికం న గురోరధికం
న గురోరధికం న గురోరధికం
శివ శాసనత శివ శాసనత
శివ శాసనత శివ శాసనతః

అని చెప్పబడినది.

కనుక గురు శుశ్రూష శ్రద్ధగా చేయాలి. గురు శుశ్రూష ద్వారా గురుదేవుని సంతోషపరచి వారి అనుగ్రహం పొందాలి. గురువును శరణు వేడాలి. ఆత్మ జ్ఞానానికి సద్గురువును ఆశ్రయించి తీరాలి. భక్తి వుండాలే కాని ఎవరైనా సరే సద్గురు అనుగ్రహాన్ని పొందుతారు. త్రిమూర్త్యాత్మకుడైన సద్గురువు సర్వ సమర్థుడు. ఆయనకు సాధ్యా సాధ్యాలు వుండవు. ఆయన వాక్కు పరమేశ్వర శాసనమే అని పెద్దలు వచిస్తున్నారు. సద్గురువును విశ్వసించి ధృఢభక్తితో సేవించే భక్తులు గృహస్థులైనా, సన్యాస సమానులే. శిష్యుడు గురువును నీడవలె సేవించాలి. గురువే పరమేశ్వరుడని విశ్వసించాలి. గురుపాద సేవచేసి, గురు పాదోదకాన్ని గ్రోలాలి.

గురువును మానవమాత్రుడిగా తలచటం పాపము. గురుదేవుని నిందించరాదు. తూస్కారము చేయరాదు. చిన్నపుచ్చరాదు. గురువు ఎదుట అహంకరించరాదు. గురు ధిక్కారము చేయరాదు. బృహస్పతి దేవతల గురువుగదా. దేవేంద్రుడంటివాడు, అహంకరించి గురుదేవుని చిన్నపుచ్చి, గుర్వాజ్ఞ ధిక్కరించి చాలా కష్టముల పాలయ్యారు గదా. అట్లే దైత్య గురువగు శుక్రాచార్యుని ధిక్కరించి అహంకరించిన దానవేంద్రులెందరో నశించిరి గదా.

గురుభక్తిచేతనే ఎందరో ముక్తులైనారని శాస్త్రములు ఘోషించుచున్నవి. అనేకమంది భక్తులు గురుదేవుని గుణకీర్తనము చేసి తరించారు.

ఎవరైతే ఓర్పుతో సహనంతో, దృఢమైన భక్తితో అచంచలమైన విశ్వాసంతో తన గురుదేవుని సేవిస్తారో అట్టివారు తప్పకుండా ధన్యులౌతారు.

కలియుగంలో సంకల్ప మాత్రంచేతనే అనగా తీవ్రమైన తపస్సు, సమాధి అవసరం లేకుండానే పుణ్యాన్ని సంపాదించుకోవచ్చు. భక్తిని మించిన మార్గంలేదు.

ఎటువంటి సాధనయైన, గురువుయొక్క ఆశ్రయం లేకుండా సాధ్యంకాదు.

మహాత్ముల సేవయే కాదు, వారి సన్నిధికూడా మనలో సాత్విక గుణాన్ని అభివృద్ధి చేస్తుంది.

సద్గురువు బ్రహ్మ విష్ణు శివాత్మకుడు. పరబ్రహ్మము. ఆయన విశ్వరూపుడు కూడా. గురు పాదాన్ని నమ్మి అనుసరించినవాడు తప్పక గమ్యాని చేరుతాడు.

గురుపాదమేగతి--కథ-జ్ఞాపకం వస్తున్నది.

ఒక నదీతీరంలో ఒక ఆశ్రమం వున్నది. అక్కడ ఒక గురుశిష్యులు నివసిస్తున్నారు. రోజూ ఆ శిష్యుడు నది దాటి అవతల గ్రామంలో మధూకరం సేకరించి వచ్చి గురువుగారికి సమర్పిస్తు వుండేవాడు. ఆ నది మోకాలి లోతు నీరే అవటం వల్ల రోజు ఆ శిష్యుడు సులువుగా వెళ్ళి రాగలుగుతున్నాడు. ఒకనాడు విపరీతమైన వర్షం కురిసింది. నది పొంగింది. ఆ కారణంచేత నది దాటటం కష్టమైంది. మరి ఆవలి ఒడ్డుకు వెళ్ళి మధూకరం తీసుకురావటం ఎలా! శిష్యుడు గురు భక్తుడుగదా. గురువుయందు సంపూర్ణ విశ్వాసం గలవాడు. ఆ రోజుకూడా ఆవలి గ్రామానికి వెళ్ళటానికి శిష్యుడు నదీతిరానికి వెళ్ళాడు.

కాని ఏమిలాభం నదిపరవళ్ళు తొక్కుతోంది దాటే అవకాశం కనిపించలేదు. ఆవలి ఒడ్డునవున్న గ్రామానికి వెళ్ళకపోతే ఆ రోజు గురువుగారికి భిక్ష అందించలేనుగదా అని శిష్యుడు దుఃఖించాడు. వెంటనే అతనికి స్ఫురించింది. గురుర్బ్రహ్మా గురువేవిష్ణువు, గురువేమహేశ్వరుడు. గురువు సాక్షాత్తు పరబ్రహ్మ అని మనస్సు ఏకాగ్రతచేసాడు. గురుపాదము నాశ్రయించాడు. "గురుపాదమేగతి" "గురుపాదమేగతి" అని నదిలో దిగినడుస్తున్నాడు. అతనికి నదిలోనీరు రోజావలె మోకాళ్ళుదాటలేదు. ఆవిశ్వాసంతో అవతలిఒడ్డుచేరాడు. మధూకరం చేశాడు. ఆ పదార్థమును జాగ్రత్తగా మూటకట్టుకొని, గురుపాదస్మరణచేస్తూ నదిదాటాడు. గురువుగారికి భిక్షఅందించాడు. తరించాడు.

గురువుగారు ఆశ్చర్యచకితులయ్యారు. నాయనా ఇంతటి వరదలో నదినిఎలా దాటావు! అని ప్రశ్నించారు. శిష్యుడు గురుదేవులకు నమస్కరించి ఇలా మనవి చేశాడు. స్వామి! గురుదేవ! గురుదేవులు సాక్షాత్తు పరబ్రహ్మమని నాకు మీరే బోధించారుగదా... గురుపాదమును నమ్మిన వారికి ఏదీ అసాధ్యంలేదని శెలవిచ్చారు గదా. మీరే నాగురుదేవులుగదా కనుక నా గురుపాదములను ధృడముగా విశ్వసించి గురుపాదమే గతి అనినమ్మి, గురుపాదమునే స్మరిస్తూ నది దాటివెళ్ళాను. భిక్షతీసుకు వచ్చాను. స్వామి! కాని అక్కడ జరిగిన ఒక విషయం మనవి చేస్తాను. తమరు అనుజ్ఞఇస్తే" అని మిన్నకున్నాడు శిష్యుడు. గురువుగారు అనుమతించారు. శిష్యుడు ఇలా మనవిచేశాడు. స్వామీ! నేనా అవతల ఒడ్డుకు చేరి అక్కడ ఒక గృహస్తు ఇంటికి వెళ్ళాను. "భవతీ! భిక్షాం

దేహి అన్నాను. ఆ ఇంటి గృహస్తు ఆయన సతీమణి వచ్చి చాలా ఆప్యాయంగా ఈ భిక్షను అందచేస్తూ ఇలా అన్నారు. నాయనా రేపటి రోజు మేము మీగురుదేవులకు స్వయంగా భిక్ష చేయాలని అనుకుంటున్నాము. నీవు మీ గురువుగారికి మా కోరిక విన్నవించి రేపు వారిని కూడా తీసుకురా" అన్నారు. అని విన్నవించాడు.

గురువుగారు సంతోషించారు. మరునాడుఉదయం గురు శిష్యులిద్దరు బయలుదేరారు. నది ఒడ్డుకుచేరారేగాని నదిఉధృతంగానే ప్రవహిస్తుంది. శిష్యుడుముందు నదీమతల్లికి సమస్కరించి "గురుపాదమేగతి " అని నమస్కరిస్తూ నదిలో నడుస్తున్నాడు. నీరు అతనికిమోకాలివరకేవుండటంవల్ల అతడు నదిలో సులువుగా నడుస్తున్నాడు. శిష్యుని వెనుక గురువుగారు కూడా నదిలోదిగారు. గురువుగారు అనుకున్నారు శిష్యుడు "గురుపాద మేగతి"అనిస్మరిస్తున్నాడుగదాగురుపాదమే అంటే నాపాదమేగదా నేనేగదా వాని గురువుని అనుకున్నాడు.

గురువుగారు "నాపాదమేగతి" "నాపాదమేగతి" అని స్మరిస్తూ నదిలో నడవటం మొదలు పెట్టాడు. కాని అడుగు అడుగుకు నదిపెరిగి నీరు కంఠంలోతు వరకు వచ్చింది. కానీ ముందు నడుస్తున్న శిష్యునికి మోకాళ్ళ వరకే వుంది. ఏమిటి చిత్రం. గురువుగారు ఇంకొక్క అడుగువేస్తే తానుమునిగి పోతాడు. అప్పుడు గురువుగారు శిష్యున్ని ఆపారు. నాయనా ఏమిటి ఈ చిత్రం నీకు నీరుమోకాళ్ళ వరకేవస్తోంది నాకు! కంఠం వరకు వచ్చింది. ఇక మునిగి పోయేటట్లు వున్నాను. అన్నారు.

వెంటనేశిష్యుడు అన్నాడు. స్వామి నేను నాగురువుగారి పాదములను ధృడంగా విశ్వసించి నడుస్తున్నాను. మీరు కూడా మీ గురుదేవుల పాదపద్మములను ధృడంగా విశ్వసించి నడవండి. అన్నాడు.

గురువుగారికి చటుక్కునతనతప్పిదమేమోగోచరమైంది. మందమతిని, అహంకారిని. గురుపాదమంటే, నేనే గురువునుగదా! గురువంటే నేనేగదా! గురుపాదమంటే నా పాదమేగదా. "నాపాదమేగతి" అని స్మరించాను. నా గురు దేవుల విస్మరించాను ఎంతటి పాపాత్ముడ్ని. అని జ్ఞానం గలిగి వెంటనే తన గురుదేవుల పాదపద్మములనుధృడంగా విశ్వసించి స్మరించాడు. అంతే! గురువుగారికి కూడా నది మోకాళ్ళ దాటలేదు. క్షేమంగా ఆవలి ఒడ్డుచేరారు. అక్కడ ఆ పుణ్య దంపతుల ఆతిధ్యం స్వీకరించి క్షేమంగా తిరిగివచ్చారు. ఆశ్రమానికి—

కనుక ఎవరి గురుదేవులను వారు ధృడమైన అచంచల భక్తివిశ్వాసములతో సేవించాలి అని నీతిగదా!

గురుదేవులను ధిక్కరించరాదు. నిందించరాదు, అవహే ళనచేయరాదు. గురుదేవులను మోసగించరాదు. అట్లు చేసిన మహాపాపం వస్తుంది. పెద్దలవల్ల విన్న ఇతిహాసము మనవి చేస్తాను.

బ్రహ్మమిత్రుడు అను మహర్షి యుండేవాడు. ఆయన మహా తపస్సంపన్నుడు. బ్రహ్మ జ్ఞాని. వీరి శిష్యులలో ఒక గంధర్వరాజు ఉండేవాడు. బ్రహ్మమిత్రుడు ఆయుర్వేద శాస్త్ర విశారదుడు. శిష్యుడైన గంధర్వరాజు,తాను గంధర్వుననియు, పైగా రాజునని మహా గర్విష్టి. ఒకనాడు ఆ గంధర్వరాజు తన గురుదేవులైన బ్రహ్మమిత్రులవారి వద్దకు వచ్చి, వినయ విధేయతలు లేకుండా, అహంకారంతో ఇలా అన్నాడు. "గురుదేవా! నాకు ఆయుర్వేద విద్య ప్రసాదించండి" అని. గురువుగారు చూచారు. ఏమిటి? ఈ శిష్యుడు ఇంత అహంకారంతో ప్రవర్తిస్తున్నాడు.విద్యను అభ్యసించటానికి కావలసిన వినయ విధేయతలు అసలు కనిపించటం లేదు. ఇట్టి గర్విష్టికి విద్యాదానం చేయరాదని తలచి ఆయుర్వేద విద్య ప్రసాదించుటకు నిరాకరించాడు. ఆ గంధర్వునకు చాలా కోపం వచ్చింది. గురువుగారిని అనేకవిధాల నిందించాడు. తూలనాడాడు. వెళ్ళిపోయాడు. వెళ్ళాడేగాని, తన పట్టుదల వదలలేదు. గంధర్వుడు గదా! తనకు గల అదృశ్య విద్యను ఉపయోగించదలచాడు. గురువుగారు తన శిష్యులకు ఆయుర్వేద విద్య బోధించే సమయంలో తిరస్కరణీ విద్యతో తాను అదృశ్యంగా ఉండి ఆ విద్యను దొంగిలించాడు. విద్యను గ్రహించాను గదా అని ఊరుకోలేదు. గురువుగారిని అవహేళన చేయ సంకల్పించాడు. సశరీరంగా ఒకరోజున గురువుగారి వద్దకు వచ్చాడు. గురువుగారితో ఇలా అన్నాడు.

"గురుదేవా! మీరు విద్య బోధించనంత మాత్రాన ఏమీ మునిగి పోలేదు. నేను ఆయుర్వేద విద్య పరిపూర్ణంగా అదృశ్య రూపంలో అభ్యసించాను. మీరు బోధించనంత మాత్రాన నేను విద్యను గ్రహించలేకపోయినానా? చూడండి నా పాండిత్యం" అని గురుదేవులను అవహేళన చేసి బహువిధ నిందలు కురిపించాడు.

బ్రహ్మమిత్రుడు మహా శాంత స్వరూపుడు. శిష్యుని ప్రవర్తనకు విచారించాడు. కాని గంధర్వుడు అంతటితో ఆగక నిందలతో బాణవర్షం కురిపించటంతో, తన శిష్యుని అహంకారం అనే దోషంనుండి విముక్తిచేసి ఉద్ధరించాలని తలచాడు.

"గంధర్వా! శిష్యునకు ఈలాంటి అహంకారం మంచిది గాదు. గురునింద మహాపాపము. ఇది రాక్షస గుణం. నీవు ఇంకా దేవతా గణములలో ఉండతగవు. నీవు రాక్షసుడవై పోవుదువుగాక!" అని శపించాడు.

గంధర్వునకు అహంకారం తొలిగింది. రాక్షసుడైనాడు. గురువుగారి కాళ్ళమీద పడినాడు. క్షమాపణ వేడాడు. స్వామి! అల్పజ్ఞే ఘోరపాపం చేశాను. ఈ రాక్షస జన్మనుండి విముక్తిని అనుగ్రహించండి" అని ప్రాధేయపడ్డాడు. గురువు కరుణా సముద్రుడు గదా! శిష్యుని ఉద్ధరించుటకే శాపం ఇచ్చారుగాని కక్ష సాధించుటకు కాదు గదా. గురువుగారు ఇలా వచించారు. "నాయనా! నీవు శాపగ్రస్తుడవైనావు. అనుభ

ఏంచ వలసినదే. కాని పశ్చాత్తప్తుడవైనావు. కనుక నీకు విముక్తి మార్గం ప్రసాదిస్తున్నాను. నీవు రాక్షసునిగా అరణ్యంలో సంచరిస్తూ, సంచరిస్తూ నీ కుమార్తె అయిన మనోరమ వెంట కామ దృష్టితో వెంటబడతావు. అప్పుడు ఆ అరణ్యంలో సరోచి అనే మహారాజు నీకు శాప విముక్తిని ప్రసాదిస్తాడని" శాప విమోచనం అనుగ్రహిస్తాడు. ఇలా కొంతకాలం గడుస్తుంది. ఒకనాడు రాక్షస రూపంలో యున్న గంధర్వ రాజు అరణ్యంలో సంచరిస్తూ ఉంటాడు. ఇంతలో తన కుమార్తె అయిన గంధర్వ కన్య మనోరమ తన చెలికత్తెలతో అచ్చట సరోవరం దగ్గర కనిపించింది. ఆ రాక్షసుడు ఆ కన్య తన కుమార్తెయేనను విషయం తెలియక ఆమెను మోహించి ఆమె వెంట పడతాడు. ఆమె తన చెలికత్తెలతో పరుగెత్తుతోంది. "రక్షించండి" "రక్షించండి" అని ఆర్తనాదం చేస్తోంది. ఇంతలో ఆ ప్రాంత మహారాజు అయిన సరోచి అనువాడు అశ్వంమీద రావటం ఆమె ఆర్తనాదం వినటం జరుగుతుంది. ఆ మహారాజు ఆ రాక్షసుని అడ్డగిస్తాడు. రాక్షసుడు విజృంభిస్తాడు. అప్పుడు మనోరమ అస్త్ర హృదయ విద్యను ఆ మహారాజుకు బోధిస్తుంది. వెంటనే ఆ విద్యా బలంతో ఆ మహారాజు ఆ రాక్షసుని ఓడిస్తాడు. వెంటనే ఆ రాక్షసునికి శాప విమోచనం అవుతుంది. తన స్వస్వరూపమైన గంధర్వ రూపం చేకూరుతుంది. ధన్యుడౌతాడు. అప్పుడు పూర్వజ్ఞానం కలుగుతుంది. ఆ మహారాజుకు తన కుమార్తె అయిన మనోరమను వివాహం చేస్తాడు.

గురువును నిందించిన పాపఫలం అనుభవించాడు గదా! తన తప్పు తాను తెలుసుకున్నాడు ఆ గంధర్వుడు. తన గురుదేవుడైన బ్రహ్మమిత్రులవారి సన్నిధికి వెళ్తాడు. సాష్టాంగ నమస్కారం చేస్తాడు. స్వామి! గురుదేవ! నా

తప్పును మన్నించండి. నన్ను అనుగ్రహించండి! అని కన్నీరు మున్నీరుగా విలపిస్తాడు.

గురుదేవుడు అనుగ్రహిస్తాడు. కనుక గురుదేవులను నిందించరాదు. ఎవరన్నా గురుదేవులను నిందిస్తే, నీకు చేతనైన రూపంలో వానిని నిగ్రహించాలి. నీకు చేతకానిచో అక్కడి నుండి వెళ్ళిపోవాలి. అదీ చేతకానిచో చెవులు మూసుకోవాలి. అంతేగాని గురునిందను విని ఉపేక్షించరాదని పెద్దల వాక్యం.

ఇక ప్రస్తుత చరిత్రకు వద్దాం. మా గురుదేవులు శ్రీ సదానంద సరస్వతి మహారాజులవారి కృపా కటాక్షం వల్ల ధన్యులమయ్యాము. దత్తభక్తులు శ్రీ వేణుగోపాల కృష్ణమూర్తి మహాశయుల వారి సహచర్యము, వారి కృపా కటాక్షములకు పాత్రులమై శ్రీవారి సేవలో ఇప్పటికి అందించిన గ్రంథ మాలలో అక్కలకోట మహారాజులవారి చరిత్ర ఒక పుష్పము. మా గురుదేవులు దత్తభక్తులు శ్రీ వేణుగోపాల కృష్ణమూర్తి గారి సూచనను శిరసావహించి దత్త ప్రభువు అనుగ్రహించిన మేరకు శ్రీ దత్త భగవానుల అవతారమైన శ్రీ మాణిక ప్రభువులవారి చరిత్ర మనవి చేయ సాహసిస్తున్నాము. భక్త మహాశయులు పఠించి, ఆనందించి తరించ వినతి. తప్పులు మావి. మహాత్మ్యము స్వామిది.

శ్రీ దత్త సేవలో
చిలుకూరు బాలకృష్ణమూర్తి
శ్రీమతి భవాని
విజయవాడ

గురుపూర్ణిమ
బహుధాన్య ఆషాఢ
శుద్ధ పూర్ణిమ
9-7-98

# శ్రీ దత్త సేవ శివ సేవయే

## (శ్రీ దత్త దివ్యవాణి)

శ్రీ దత్తుని కన్నా శివుడు వేరుకాదు. దత్తసేవ శివ సేవయే. కాలోచిత సేవముఖ్యం. యజమాని గృహమున పెండ్లి జరుగుచున్నది అపుడు ఆ పెండ్లి పనులలో పాల్గొన వలెనే కాని, ఆయన పొలమునకుపోయి, పొలములో పనిచేసి వచ్చి పెండ్లి పనులలో పాల్గొననివాడు యజమానికి సేవ చేసినట్లా? చేసినవాడే అయినా నిజంగా చేయనివాడు. ఇప్పుడు స్వామి కోరేసేవ ఏమిటనగా—అజ్ఞానాంధకారమున తత్త్వము తెలియక మూఢులై స్వార్థపరులైన జీవుల కండ్లు తెరిపించుట. దానికి ఆయన వాక్యములే మందు. వాటిని ముద్రించి ప్రచారము చేయవలెను. వాటితో కన్నులు తెరచి దైవారాధన దైవం కోసం చేసి తరింతురు.

ఇది ప్రస్తుత పెండ్లిపని వంటిది. సీతాన్వేషణ సమయమున భరతుని ఓదార్చుచూ కూర్చున్నచో కాలోచితసేవ కాదు. కాన మన శక్తిని మన కాలమును గురుఆజ్ఞా పాలనములో అర్పించవలయును తప్ప, అన్యము కారాదు. చెప్పిన సీతాన్వేషణ కార్యముననే సమస్త శక్తిని ఉపయోగించాలి.

గురువునందే, గురు ఆజ్ఞనందే సమస్త కాల-శక్తి-దృష్టి- బుద్ధులను కేంద్రీకరించినవాడే హనుమ స్వార్థమును తీసివేయుటకు, నిష్కామారాధనకు గురుదత్త వాక్య ప్రచారమే సరియైన కాలోచిత ఔషధము.

ఓం తత్ సత్



దత్తభక్తులు

బహుధాన్య నామ సం॥ వైశాఖ బహుళచతుర్దశి శుక్రవారం.

## శ్రీ దత్తదివ్యవాణి

### బ్రహ్మజ్ఞానము

శ్లో॥ నవేదాదపరోగ్రన్థః నదత్తాద్పరిహ్మ చాపరమ్
నమేబోధాత్పరం జ్ఞానం నత్వత్సేవాన్యసాధనమ్॥

తా॥ వేదములకన్నను వేరగు గ్రంథము కలదా?
దత్తుని కన్నను వేరగు బ్రహ్మము కలదా?
నా యీ బోధల కన్నను వేరగు జ్ఞానముకలదా?
నీ యీ సేవల కన్నను వేరగు సాధన కలదా?

నామ రూపముల కన్ననూ తత్త్వము ముఖ్యము. తత్త్వమనగా గుణస్వరూపము. అజ్ఞానులు తత్త్వమును గ్రహించక కేవల నామరూపములనే గ్రహింతురు. జ్ఞానులు నామరూపమునకు ప్రాధాన్యమీయక తత్త్వమునే గుర్తింతురు. ఉదాహరణకు- దసరా పులివేషము వేసిన వానిని చూసి పిల్లలు

భయపడుదురేకానీ జ్ఞానులగు పెద్దలు భయపడరు. అట్లుకాక,
పులివంటి పరాక్రమము కల వ్యక్తిని చూసి, పులి వేషము
లేకున్ననూ జ్ఞానులైన పెద్దలు భయపడుదురు కానీ, అజ్ఞాను
లైన పిల్లలు వాని పరాక్రమము తెలియని వారుకానీ
భయపడరు. నా మికన్నానామము, రూపికన్నా రూపము
గొప్పవి కావు. నామ రూపములు కల వస్తువే నామి, రూపి
అనబడును. “రామా! నీవు దాటలేని ఈ సముద్రమునకు
వంతెన కట్టుటకు నీ నామమును రాయిపై లిఖించివేయగా
రాయి మునుగుటలేదు. కాన నీ కన్నా నీ నామము గొప్పది”
అని ఒక వానరుడు పలికి రాయిని సముద్రంలోవేయగా అది
వెంటనే మునిగినది. జపము అనగా వస్తుతత్త్వాకర్షణంతో ఆ
వస్తువును స్మరించుటయే కాని, ఆ వస్తు నామోచ్చారణము
ఆ వస్తు తత్త్వమును ప్రయత్నపూర్వకంగా గుర్తుతెచ్చు
కొనుట కాదు. పాయసమునుతిని, దాని మాధుర్యగుణమైన
పాయసతత్త్వముపై ఏర్పడిన ఆకర్షణ కారణంగా
“పాయసము” “పాయసము” అని దాని నామమును జపించు
చున్నాడే తప్ప, పాయసముపై ఆకర్షణలేక, కేవలము
“పాయస నామోచ్చారణంతో పాయస మాధుర్యమును,
ప్రయత్నపూర్వకంగా గుర్తుతెచ్చుకొనుటకాదు. తత్త్వాకర్షణము
కారణంగా, జపము అనుకార్యము పుట్టినదే తప్ప, జపము
అనుకారణం నుండి, వస్తు తత్తమును స్మరించుట అను
కార్యమురాలేదు. అట్టిది జపముకాదు. అది కేవలము ప్రయత్న
పూర్వకంగా ఒక శబ్దమునుచ్చరించి, ఆ శబ్దార్థవస్తువుయొక్క
జ్ఞానమును పొందుటయే. పిల్లవాడు పుస్తకము చదువుచూ
“కుండ” అని శబ్దమును పలికి, ఆ శబ్దంద్వారా కుండను
స్మరించుచున్నాడు. ఇట్టి శబ్దోచ్చారణము జపముకాదు.
కేవలము వస్తు జ్ఞానమును పొందుట అట్లుకాక పాయస
మాధుర్యమును రుచి చూసి, దానికై తపనతో “పాయసము”

అనుశబ్దము నుచ్చరించుటయే నిజమైన జపము. అట్టినామము లలో వైవిధ్యముండును. ఒకడు పాయసము అని కలవరిస్తు న్నాడు. మరొకడు తన భాషలో "పొంగల్" అని కలవరిస్తు న్నాడు. శబ్దాలు వేరైనా వస్తువూ, దాని తత్త్వము. ఆ తత్త్వముపై ఆకర్షణమూ ఒక్కటియే కదా ప్రధానము. అసలు ఏ శబ్దమునూ, ఉచ్చరించక కేవలము పాయసము ధ్యానముతో ఉండుట "అజప" స్థితి. ఇది జపస్థితి కన్నా తీవ్రము ఉత్తమము. ఇదియే సమాధి. ఇందులో నామోచ్చారణ మసలుండదు.

శ్రీ దత్తుని తత్త్వమును స్మరించి, ఆ తత్త్వమును ఆచరించుటకు చేయు ప్రయత్నమే సాధన తప్ప, కేవల దత్త నామోచ్చారణముకాదు. దత్త రూపస్మరణమూకాదు. పులి పరాక్రమ శక్తిని సంపాదించు వ్యాయామాదులను చేయుట సాధనకాని, పులివేషము వేయుట, పులి నామోచ్చారణము సాధనకాదు. శ్రీ దత్తుని తత్త్వమును యథాతథంగా ఆచరించిన శంకరాచార్యుని చివరలో శ్రీ దత్తుడు కౌగలించుకొని "సోదరా!" అనితనంతవానిగా సంభోధించినాడు. శ్రీ దత్తుని వలె శంకరులు కూడా వివాహమాడక, తల్లిని త్యజించి, సర్వ జీవుల ఉద్ధరణమునకు ఏ స్వార్థ తత్త్వము లేకుండా సంచ రించినారు. ఇదే నిజమైన సాధన. కొంతయైనా ప్రయత్నించి, ప్రయత్నించి, శ్రీ దత్త తత్త్వమును మన స్వభావములోనికి తెచ్చు కొనుటయే సాధన. అంతకాకపోయినా, గృహస్థుగా ఉండియైననూ, కొంత సమయమైనా సర్వ జీవోద్ధరణమునకు జ్ఞానప్రచారసేవను చేయుట చేత, శ్రీదత్త తత్త్వమునకొంత యైన మనకు సిద్ధించును. అట్టివాడు నిజంగా శ్రీదత్తస్థాయిని

సమీపించినవాడు కాన వాడే "ఉపనీతుడు" (దగ్గరకు వచ్చిన
వారు) శ్రీదత్తుడే బ్రహ్మమని గుర్తించినవాడే బ్రహ్మజ్ఞాని
యగు బ్రాహ్మణుడు. కేవలము జందెము వేసుకున్న
ఉపనీతుడూకాదు. కులము మాత్రము చేత బ్రాహ్మణుడూ
కాడు. దత్త నామ రూపములో బ్రహ్మతత్త్వ బోధకములు
సృష్టి స్థితిలయములను మూడు పనులను త్రిముఖముల ద్వారా
చేయు ఏకైకరూపము దత్తుడే బ్రహ్మము. ఇదే బ్రహ్మము
యొక్క జిజ్ఞాస. ఇదే "అథాతోబ్రహ్మజిజ్ఞాసా" అని
ప్రథమమైన బ్రహ్మ సూత్రము.

జిజ్ఞాస అనగా బ్రహ్మతత్త్వమును తెలియుటకాదు.
బ్రహ్మమును కేవలము గుర్తించుట ఈ మూడు పనులను
చేయు ఏకైక స్వరూపము బ్రహ్మమని వేదము. ఇదే
"జన్మాద్యస్యయతః" అని రెండవ బ్రహ్మసూత్రము. ఇట్టి
నిర్వచనమునకు ప్రమాణము వేదముకాన, మనకు గ్రాహ్య
మని బోధించుట "శాస్త్రయోనిత్వాత్" అని మూడవ
సూత్రము.

ఈ మూడు సూత్రముల సారమే బ్రహ్మజ్ఞానము.
సర్వదేవతా రూపాలలో ఏది బ్రహ్మమని గుర్తించుటకు చేయ
వలసిన జిజ్ఞాస; జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను
చేయునది ఏకైక స్వరూపము బ్రహ్మమును గుర్తించు
లక్షణము; ఆ లక్షణమును చెప్పుచున్నది పరమ ప్రమాణిక
మైన వేదము - అని ఈ మూడు వాక్యాలే సూత్ర త్రయము.
ఈ బ్రహ్మజ్ఞానము శ్రీ దత్తుడే బ్రహ్మము అన్యస్వరూపము
కాదని నిర్ణయించుచున్నది.

ఓం తత్ సత్.

దత్త భక్తులు

శ్రీ జన్నాభట్లవేణుగోపాల కృష్ణమూర్తి

MSC PHD

శ్రీ దత్త

# శ్రీ మాణిక ప్రభు చరిత్ర

శ్రీ మాణిక ప్రభువు శ్రీ దత్తాత్రేయ అవతారము. శ్రీపాద వల్లభుడు. నృశింహ సరస్వతి, మాణిక ప్రభువు, అక్కలకోట మహరాజ్, శిరిడి సాయినాధుడు. వర్తమాన ములో శ్రీ సత్యసాయి భగవానుడె దత్తావతారము.

శ్రీ మాణిక ప్రభువు ఈశ్వరనామ సంవత్సర మార్గశిర్ష శుద్ధ చతుర్దశి మంగళవారమునాడు అనగా ది.22-12-1817 తేదీన జన్మించిరి. మనోహర నాయకుడు వీరి పితృదేవులు. బాయాదేవి వీరి మాతృశ్రీ. గుల్బర్గా కళ్యాణిఅను గ్రామమున వీరు జన్మించిరి. మనోహర నాయకుడుభగవద్భక్తుడు. బాయా దేవి మంచి స్వభావము గలది. 1813వ సంవత్సరమున ఈ పుణ్య దంపతులకు పుత్ర సంతానము కలిగెను. వానికి హను మంతుడని నామకరణము చేసిరి. 1817లో మరియొక కుమా రుడు జన్మించెను. ఈ పుత్రునకు తల్లిదండ్రులు మాణికయని నామకరణము చేసిరి. తదనంతరము వీరికి మూడవపుత్ర సంతానము కలిగెను. మనోహరుడు కాలధర్మము చెందిన తర్వాత బాయాదేవి ముగ్గురు పిల్లలతో కల్యాణి పట్టణములోనే నివసించెను.

శ్రీ మాణిక ప్రభువు తన బాల్యమునుండియు మానవా తీతమైన శక్తులను వ్యక్తము చేసిరి. అరణ్యములోను, గుహల

లోను తిరుగుచుండెడివారు. వీరికి గోవిందుడను గొల్లపిల్లవాడు చిన్ననాటి స్నేహితుడు. వీరితోపాటు అడవులలో తిరిగెడి వాడు. ఒకనాడొక విచిత్రము జరిగెను. గోవిందుడు మామూలు ప్రకారము తనవద్దకు ఆటలకు రాలేదు. ఎందుకు రాలేదా యని, శ్రీ మాణిక ప్రభువు గోవిందుని ఇంటికి వెళ్లెను. గోవిందుడు చనిపోయి యుండెను అందరు దుఃఖించు చుండిరి. అప్పుడు శ్రీ మాణిక ప్రభువు 'గోవిందా'యని కేకపెట్టి పిలచెను. అద్భుతము. వెంటనే చనిపోయిన గోవిందుడు నిద్ర నుండి మేల్కాంచిన వానిలా లేచి కూర్చునెను. అందరు మహదానందము ననుభవించిరి. శ్రీ ప్రభువులవారు అక్కడ నుండి వెడలిపోయిరి. ఎంత మహిమ!

శ్రీ మాణిక ప్రభువులవారి బాల్య చేష్టలు బహు అద్భుతములు. వీరిని చిన్నతనములో పిచ్చిబావు అని పిలిచెడి వారు. మామిడిపండ్లు అమ్ముచున్న వనితకు, మామిడిపండ్లు తనకు ఇచ్చినచో సంతానము కల్గునని చెప్పుట, ఆమెవద్ద మామిడిపండ్లు పుచ్చుకొనుట, తర్వాత ఆమెకు సంతానము కల్గుట మహా అద్భుతముగదా. పిల్లలందరు కలసి మరియొక సమయమున ఆటలాడుకొనుచుండిరి. అప్పుడు ఒక పిల్లవాడు ఆ అడవిలో చచ్చిపడి వున్న ఒక చిలుకను తీసి, శ్రీ ప్రభువుల వారి చేతిలో పెట్టెను. అప్పుడు శ్రీ ప్రభువువారు దానిని విసరివేయగా రెపరెప కొట్టుకొనుచు ఎగిరిపోయెనట. ఎంతటి మహిమ! ప్రభువుల బాల్యలీలలెన్ని చెప్పుకొనినను తనివి తీరదు. ప్రభువులవారి బాల్య స్నేహితులలో మేల్ గిరిభట్టు అనువాడు డొకడుండెను. ఆయన నల్లగా ఉండుటచే, ప్రభువు వానిని కాలంభట్టు అని పిలిచెడివారు. అతడు రోజు

శివపూజ చేసెడివాడు. "ఎందుకు రాతికి పూజ చేసెదవు! శివుని సాక్షాత్తు పూజించవచ్చుగదా యని" శ్రీ ప్రభువులవారు ఒకనాడనిరి. అప్పుడు కాలంభట్టు "నాకు శివ సాక్షాత్కారము కాలేదుగదా ఎట్లు పూజింతున"నెనట. అప్పుడు ప్రభువులవారు కాలంభట్టును కండ్లు మూసుకోమనిరట. అద్భుతం! శ్రీ జటాజూటధారియైన ఈశ్వరుడు సాక్షాత్కరించెనట. ఎంత వింత?

శ్రీ ప్రభువులవారి మేనమామ కుటుంబ పోషణకు సాయపడుచుండిరట. సంపాదన చాలనందున మేనమామగారు శ్రీ ప్రభువులకు పన్నులు వసూలుచేయు ఉద్యోగము ఇప్పించిరట. శ్రీ ప్రభువులవారు పన్నులు వసూలుచేసి, ఆ పైకమును బీదలకు దానము చేయుచుండిరట. అందువలన శ్రీ ప్రభువులవారిని ఉద్యోగమునుండి తొలగించిరట. కాని శ్రీవారు ఏమి స్పందించలేదట. ప్రభువు శాంతి సముద్రముగదా! ఇట్లుండ మేనమామగారు కోపించి "నీ కుటుంబపోషణ ఇకనుంచి నేను చేయను నీకుభోజనము పెట్టను" అని మందలించెనట. వెంటనే శ్రీ ప్రభువు తన దుస్తులను విప్పి పారవేసి మేనమామకు నమస్కరించి గ్రామము వదలి వెడలిపోయిరట.

శ్రీ ప్రభువులవారు వెడలిపోవునపుడు వారి నోటివెంట అమూల్య వాక్యములు వెలువడెనట.

"భగవంతుడొక్కడే. ఆయనయే సృష్టి స్థితి లయము లను మూడు కార్యములు చేయుచున్నాడు. "నేను" "నాది" యను అహంకారము అసత్యము. మాతృ గర్భమున శిశువును రక్షించినవాడెవరు? ఆ పరబ్రహ్మమే" అనిపలికిరట.

శ్రీ ప్రభువులవారు గ్రామమును విడిచివెళ్ళిన తర్వాత అందరూ దుఃఖించిరి. వారికొరకు ఎన్ని చోట్లనో వెతికిరి. చివరకు బంధువర్గము వారి దుఃఖమును పోగొట్టుటకు స్వామి దర్శనమిచ్చిరి. "నేను ఐహిక ప్రాపంచిక విషయములకు ఆకర్షితుడను కాను. నేను చేయవలసిన పనులు ప్రత్యేకముగా వేరుగా యున్నవి. నన్ను వదలి వెళ్ళుడు" అని చెప్పి అమృత కుండమను చోట శ్రీ ప్రభువులవారు కొన్నినాళ్ళు యుండిరి. శ్రీ మాణిక ప్రభువులు సాక్షాత్తు శ్రీ దత్త భగవానులే. ఎట్టి సందేహము లేదు. అప్పుడొక అద్భుతము జరిగెను. స్వామి వారి స్నేహితులు ఇద్దరు స్వామితో కలసి ఒక గుహలోనికి వెళ్ళిరట. అక్కడ ఒక సాధుపుంగవుడు రెండు శునకములను వెంటపెట్టుకొని వచ్చెనట. ఆ సాధువు తన భిక్షా పాత్రనుండి ఒక రొట్టెనుతీసి, దానిని కుక్కపాలులో కలపి ఒక చచ్చిన పామును దానిలో మెదిపి ఆ ముద్దను కొంత శ్రీ ప్రభువుల వారికి, కొంత ఇద్దరు స్నేహితులకు పెట్టెనట. శ్రీ ప్రభువుల వారు వెంటనే ఆ ప్రసాదమును భక్షించిరట. కాని ఆ ఇద్దరు స్నేహితులు ఆ ప్రసాదమును తమ తమ చేతులలోనే ఉంచు కొని చూచుచుండిరట. వారికి తినబుద్ధిపుట్టలేదు. ఇంతలో ఆ ప్రసాదము మాయమైపోయినదట. అప్పుడు శ్రీ ప్రభువుల వారు అన్నారట. "మీరు దురదృష్టవంతులని" కనక శ్రీ ప్రభువులవారి సాన్నిధ్యంలో యున్నా వారి వారి కర్మాను సారము వారికి ప్రసాదము స్వీకరించే అదృష్టం లభించలేదు. దీనికి కారణం వారు అల్ప విశ్వాసులగుటయే గదా!

శ్రీ ప్రభువువారి మహిమలను పరీక్షించవలయునని కొందరు ప్రయత్నించిరి. అందులో కల్యాణ నగరమునకు సంబంధించిన లక్ష్మణరావు యొకడు. ప్రభువులవారిని అవమానించుటకు ఆతడు యత్నించెను. శ్రీ ప్రభువుల వారివద్దకు తన స్నేహితులతో వచ్చెను. మీ తమ్ముడు నృశింహతాత్యాకు పెండ్లి ఈడు వచ్చినది గదా. పెండ్లి ఎప్పుడు చేయుదురని ప్రభువులవారిని ప్రశ్నించెను. అందుకు సమాధానముగా శ్రీ ప్రభువుల వారిట్లనిరి. "మేము బీదవారము. నేను ఫకీరును. మా తమ్మునికి పిల్లనెవరిత్తురు" అనిరి. లక్ష్మణరావు కుతంత్రముతో వచ్చెనుగదా. ఆ రోజులలో పెండ్లికొడుకువారు రు. 1000/ తెచ్చుకొనిననే పిల్లనిచ్చెదరు ప్రభువు పకీరు గదా. ఆయన యొద్ద పైకమూలేదు. ఎవ్వరు అప్పుకూడా ఇవ్వరు. కనుక ఆయన వేయిరూపాయల పైకం తెచ్చుకొనలేడని ఆయనను అవమానించవచ్చునని తలచి లక్ష్మణరావు ఇట్లనెను. "పిల్లను ఎందుకు ఇవ్వరు. మీరు వేయిరూపాయలు తెచ్చుకొన్నచో నేనే నా చెల్లెలును ఇచ్చెదనెను. శ్రీ ప్రభువుల వారు ఇట్లనిరి. "అట్లైనచో కాగితము వ్రాసి ఇచ్చెదవా" అనిరి. శ్రీ ప్రభువులవారు పైకం తెచ్చుకోలేరు కనుక తన చెల్లెలును ఇవ్వనవసరం లేదనే ధీమాతో లక్ష్మణరావు సరేనని కాగితం వ్రాసి ఇచ్చెను. పెండ్లి ముహూర్తము కూడా నిశ్చయించిరి. కాని పెళ్ళిరోజు దగ్గిరపడిననూ వేయిరూపాయల పైకం సమకూరనందున బంధువర్గము ఆందోళన చెందుచుండిరి. లక్ష్మణరావు తన బంధు వర్గముతో మహదానందపడుచుండెను. పెండ్లి దినము రానేవచ్చెను. అకస్మాత్తుగా ఒకవింత జరిగెను. ఇవప్ప షావుకారు అను నొకడు సర్వమును సిద్ధము చేసెను. శ్రీ ప్రభువులవారు ఇదంతయు శ్రీ దత్త భగవాను ని

కృపయనిరి. అంతా సిద్ధమైనదని పెండ్లివారికి కబురు పంపిరి. లక్ష్మణరావు చింతాక్రాంతుడయ్యెను. తన చెల్లెలినిచ్చి వివాహము చేయక తప్పినదికాదు. వివాహము వైభవోపేతముగా జరిగెను. పెండ్లివారుకొద్ది మందే వస్తామనిచెప్పి కుతంత్రముతో ఎక్కువగా వచ్చి ప్రభువులవారిని పరీక్షింప తలచిరి. ఆ భోజన పంక్తిలో యొకడు ఇప్పటికిప్పుడు గారెలు వడ్డించాలని పట్టుపట్టెను. ప్రభువులవారిని అభాసపాలు చేయ ప్రయత్నించెను. సంకల్ప మాత్రముచే భోజనము అక్షయమయ్యెను. ప్రతి విస్తరియందు గారెలు ప్రత్యక్షమాయెను. అందరు ఆహ ఆహ ప్రభువు మహిమయనిరి. లక్ష్మణరావు వారి బంధువులు అభాసపాలైరి. గారెలు కావలెనని అల్లరి చేసినవానికి విపరీతమైన కడుపునొప్పి వచ్చెను. చివరకు శ్రీ ప్రభువులవారికి మ్రొక్కి, చెంపలు వేసుకొని క్షమాపణ కోరితేగాని కడుపు నొప్పి తగ్గలేదు. ఆహా ప్రభువులవారి మహిమ! శ్రీ దత్త ప్రభువుకు పరాభవమున్నదా!

శ్రీ ప్రభువులవారి కీర్తి విస్తరించెను. హిందువులే కాక ముసల్మానులు సహితము తండోప తండములుగా ప్రభువులవారిని దర్శించుచుండిరి. మార్గశీర్ష శుద్ధ షష్ఠిరోజున శ్రీ ప్రభువులవారు మైలారు అను ప్రాచీన పుణ్య క్షేత్రమునకు విచ్చేసిరి. అచ్చటకు విశేష ప్రజ శ్రీ ప్రభువులవారి దర్శనమునకు వచ్చిరి. శ్రీ ప్రభువులవారి చేతినుండి ప్రసాదము దీసుకొనియే తిరిగి వెళ్ళుచుండిరి. ఇట్లుండ అచ్చట ఒక వింత జరిగెను.

నిండు యవ్వనవతియైన ఒక స్త్రీ ఆభరణముల ధరించి శ్రీ ప్రభువులను చూడవచ్చెను. ఆమెయొక వితంతువు. చిన్నతనములో భర్త గతించెనట. ఆమె ఒక మూల నిలబడి శ్రీ

ప్రభువుల వారిని దర్శించుచుండెను. ఆమె తన్మయత్వము చెందియుండుటచే అందరితో పాటు ప్రసాదము తీసుకొనుట కూడా విస్మరించెను. ఇంతలో ఒక శిష్యుడు ఆమెను హెచ్చరించగా, ఆమె తృళ్ళిపడి తెలివి తెచ్చుకొని శ్రీ ప్రభువులవారి చెంతకు ప్రసాదమునకై వచ్చెను. రెండు ఖర్జూర ఫలములను కొన్ని పుష్పములను ప్రభువు ప్రసాదముగా నిచ్చిరి. అందరు వెడలిపోవుచున్ననూ ఆమెమాత్రము శ్రీ ప్రభువులవారి నాశ్రయించియే యుండెను. శ్రీ ప్రభువులవారు ఆమెను వెళ్ళవచ్చననిరి. కాని ఆమె తనకెవ్వరు లేరనియు ప్రభువుల చరణములే తనకు సర్వస్వమని విశ్వసించి యొచ్చితినని పట్టుపట్టెను. అట్లైనచో ఈ ఆభరణములన్ని దానముచేసి రమ్ము అని ప్రభువు ఆజ్ఞాపించిరి. ఆమె వెంటనే తన సర్వ ఆభరణములను శ్రీ ప్రభువుల చరణములందు అర్పించెను. అంతట అందరు ఆశ్చర్యపడిరి. శ్రీ ప్రభువులవారు ఆమెను తన తల్లి బాయాదేవి వారి సంరక్షణలో నుంచిరి.

శ్రీ దత్తప్రభువులైన శ్రీ మాణిక ప్రభువు ఆమెను పరీక్షించ సంకల్పించిరి. ఒకనాడు నిండుదర్బారు జరుగుచుండెను. శ్రీ ప్రభువులవారు ఆజ్ఞ ఇచ్చిరి. "ఆమె ఇప్పుడు ఏ పరిస్థితిలో యున్ననూ, తక్షణం నా సమక్షమునకు రావలెనని ఆజ్ఞ." ఆ సమయమున ఆ స్త్రీ వివస్త్రగా స్నానము చేయుచుండెను. ఆమె ప్రభువులవారి ఆజ్ఞను శిరసావహించి వివస్త్రగనే నిండు సభలోనికి పరుగున వచ్చి ప్రభువు ఎదుట నిలిచెనట. వెంటనే శ్రీ ప్రభువులవారు తనపైయున్న వస్త్రమును ఆమెపై విసరివేసి ధరించమనిరట. ఆ వస్త్రమును ధరించగనే ఆమె పరమ పవిత్రు

రాలై య్యెను. ఆనాటినుండి ఆమె తెల్లనిచీర ధరించి భస్మ ధారణ చేసెను. ఆమె ప్రభువు కృపా కటాక్షములకు పాత్రు రాలైయ్యెను. ఆమెయె వెంకమ్మ అవధూత.

శ్రీ ప్రభువులవారు అనేక పుణ్యతీర్థములు సేవించి, అనేక మహిమలను ప్రదర్శించి కొన్నాళ్ళ తరువాత ఝరసీ అను ప్రదేశమును చేరిరి. బీదరు ప్రజలు వచ్చి శ్రీ ప్రభువుల వారిని తమ నివాసములకుఆహ్వానించిరి.ప్రభువుసరేననిరి.కాని శ్రీప్రభువులవారు ఝరసీలోనే యుండిరి.గాఢనిద్రలో యుండిరి. అయ్యో బీదరు ప్రజలు శ్రీ ప్రభువులవారు వచ్చెదనని చెప్పి, రాలేదని అందురు అని అచ్చటి భక్తులు ఆందోళన చెందిరి. కాని శ్రీ ప్రభువులు బీదరు వెళ్ళలేదు. మరునాడు బీదరు నివాసులు ఒక్కొక్కరు వచ్చి చేరిరి. మేము ఆతిధ్యమిచ్చితి మంటే, మేమాధిత్యము ఇచ్చితిమని చెప్పుకొని వాదులాడు కొనుచుండిరి. అంతయు సత్యమే. శ్రీ ప్రభువు సాక్షాత్తు దత్తావ తారులు గదా! ఝరసీలోనే యుండి, బీదరులో అందరి భక్తుల ఇండ్లలో ఒకే సమయమున వారి ఆతిధ్యము స్వీకరించిరి. ఎంతటి మహిమ!!

ఇట్లుండ మరియొక వింత జరిగెను. హిందువులను' ముసల్మానులను శ్రీ ప్రభువులవారు సమానముగా చూచినచో తమ ఆతిధ్యమును కూడాస్వీకరించమనిముసల్మానులు కోరిరి. ప్రభువులు అంగీకరించిరి. వారందరు శ్రీ ప్రభువులవారిని చాలా గౌరవించిరి. ప్రభువులవారు సింహాసనాసీనులైరి. వంటకములు మాంసముతో తయారుచేసిరి. పళ్లెములలోని వంటకములపై తెల్లని వస్త్రములు కప్పి తెచ్చిపెట్టి యుండిరి. భోజనము పళ్ళెములలో పెట్టి పైన తెల్లని వస్త్రములు కప్పి

అందరికిని వారి వారి ఎదుట ఉంచబడెను. భోజనమునకు ఉపక్రమించమనిరి. అప్పుడు శ్రీ ప్రభువులు తన శిష్యుని తన పళ్ళెముపై కప్పిన వస్త్రమును తొలగించవలసినదిగా ఆజ్ఞ ఇచ్చిరి. శిష్యుడు వెంటనే ప్రభువులవారి కొరకు ఉంచబడిన పళ్ళెముపై కప్పబడిన వస్త్రమును తొలగించెను. అత్యాశ్చర్యము. పళ్ళెములో ఖర్జూరఫలములు, మిఠాయి, పుష్పములు యుండెను. ఆహ్వానించిన ముసల్మానులు ఆశ్చర్యము చెందిరి. అప్పుడు అతిథులందరు వారి వారి ఎదుట యుంచిన పళ్ళెరములపై కప్పబడిన వస్త్రములను తొలగించి చూచిరి. ఆశ్చర్యము అందరి పళ్ళెరములందు అట్లేయుండెను. మోసముచేసి అల్లరి పాలుచేయ ప్రయత్నించిన వారే అవమానముతో తలవంచుకొనిరి. శ్రీ ప్రభువులవారి మహిమ వాడవాడలా ప్రాకిపోయెను. బీదరులోని హిందువులు మహమ్మదీయులకోరిక మేరకు శ్రీ ప్రభువులవారు గాదీని (అనగా దత్తపీఠము) స్థాపనచేసిరి. శ్రీ ప్రభువులవారు కళ్యాణినగరమునకు ప్రయాణమైరి. మేనాలో పయనమైరి. త్రోవలో ఒక అద్భుతము జరిగెను! మహారణ్యములో ప్రయాణము చేయుచుండ ఒక ప్రదేశమున మేనా ఒక పొదమధ్యలో చిక్కుకొనెను. బోయీలు ముందుకు పోలేక అచ్చటనే మేనాను దింపిరి. శ్రీ ప్రభువులవారు మేనా దిగిరి. అక్కడ రెండు బిళ్వ వృక్షములుండెను. వాని క్రింద శ్రీ ప్రభువులవారు విశ్రాంతి తీసుకొనిరి. అంతే! శ్రీ ప్రభువులు అక్కడనే జీవితాంతము యుండిరి. అచ్చటనే శ్రీ ప్రభువుల దేవాలయము కట్టబడినది.

19వ శతాబ్దములో శ్రీ మాణిక ప్రభువులవారుగాదీ స్థాపించిరి. ఇదే మాణిక నగరము. బీదరు సమీపమున

గలదు. ప్రభువుల దర్శనార్థము అనేక ప్రాంతములనుండి భక్తులు తండోపతండములుగా వచ్చుచుండిరి. శ్రీ మాణిక నగరమున స్థాపించబడిన గాదీని శ్రీ ప్రభువులు "దత్తాజీగాదీ" అని పిలిచిరి. ఈ గాదీ భవనమున భోజనశాల నిర్మించిరి. దీనిని బండారు ఖానాయందురు. నిత్యాన్నదానము జరుగుచుండెను. శ్రీవారి గాదీకి నిత్యము పూజ, నివేదన, ఆరతి, భజన జరుగుచుండెను. ఇట్లుండగా ఒక విచిత్రమైన అద్భుతము జరిగెను. శ్రీ ప్రభువులవారు రెండు బిల్వ వక్షముల చాయలో విశ్రమించిరనియు అచ్చటనే మాణిక్యనగర మేర్పడినదని చెప్పబడినది కదా. ఒకరోజున ఆ రెండు బిల్వ వృక్షములు తగులపడిపోయెను. అందరు అది దుశ్శకునమని భయపడి శ్రీ ప్రభువులవారి శరణుజొచ్చిరి. శ్రీ ప్రభువులవారు వారి నూరడించి ఎనిమిది దినములు పాలుతెచ్చి ఆ వృక్షముల మొదలులో పోయమని ఆజ్ఞాపించిరి. ఆశ్చర్యము, వారటుల చేయగనే, ఎనిమిదవ రోజున ఆ చెట్లు చిగిర్చి వృక్షములయ్యెను. శ్రీ ప్రభువులు సర్వశక్తి సంపన్నులు ఆయనకు సాధ్యాసాధ్యములులేవు. సాక్షాత్తు శ్రీదత్త భగవానులే ప్రణమిల్లుదము.

శ్రీ ప్రభువులవారి దర్బారులో ఐహికముల ప్రదానము, ఆధ్యాత్మిక చింతన రెండు యుండెడివి. శ్రీదత్త ప్రభువు భోగ మోక్ష ప్రదుడుగదా! ఒక రోజున ఒక విచిత్రము జరిగెను. ఒకడు సభామధ్యమునకువచ్చి శ్రీ ప్రభువులతో ఇట్లు విన్నవించుకొనెను. "ప్రభూ!" నేను గుర్రము బండి తోలుకుని బ్రతుకువాడను. గుర్రము చనిపోయినది. కనుక

కుటుంబ పోషణము జరుగుటయే కష్టముగా యున్నది. గుఱ్ఱమును కొనుక్కొనుటకు వేయిరూపాయలు ఇప్పించి రక్షించండి" అని ప్రాధేయపడెను. వెంటనే శ్రీ ప్రభువులవారు వానికి వేయిరూపాయలు యిప్పించిరి. వాడు మహదానందము పొందెను. సత్యమేమనగా వాని గుఱ్ఱము చనిపోలేదు. అబద్ధమాడి శ్రీ ప్రభువులను మోసగించి వేయి రూపాయలు సంపాదించితినిగదా యని ఉప్పొంగెను. ఇంతలో ఒక విచిత్రము జరిగెను. వాకిటిలో పెట్టుకున్న వాని బండికి కట్టి యున్న గుఱ్ఱము ఆకస్మాత్తుగా చనిపోయి క్రిందపడెను. వాని నౌకరు పరుగు పరుగునవచ్చి గుఱ్ఱము చనిపోయినదని చెప్పెను. వాడు నిర్ఘాంతపోయెను. అబద్ధముచెప్పి శ్రీ ప్రభువులను మోసగించితినని సంతోషించిన అదే సమయమున చక్కగాయున్న గుఱ్ఱము తక్షణమే నిజంగా చనిపోయెను. తన తప్పును చెప్పుకొని శ్రీ ప్రభువులవారిని క్షమించ విలపించెను. అబద్ధములాడరాదని మందలించి, శ్రీ ప్రభువులవారు ఆ వెయ్యి రూపాయలు తీసుకువెళ్ళమని ఆజ్ఞ యిచ్చిరి.

శ్రీ మాణిక ప్రభువులవారు ఆజానుబాహువు. బంగారు శరీరచ్ఛాయ, సుందరమైన విగ్రహము. చక్కని తేనె పలుకు లొలుకు వాక్పటిమ గలవాడు. కరుణార్ద్రహృదయులు ఒంటరిగాయున్న స్త్రీతో మాట్లాడెడివారుకాదు. భార్యాభర్తలిరువురును వచ్చిస్వామి వారి దర్శనము పొందవలెను. వారు ధరించు దుస్తులకు ఒక నియమములేదు. ఒక్కొక్కప్పుడు పాదుషావలె దుస్తులు ధరించెడివారు. ఒక్కొక్కప్పుడు ఫకీరు వలె దుస్తులు ధరించెడివారు. అంతా వారి లీల.

ఒకరోజున కొందరు దొంగలు నగరములో ప్రవేశించి దొంగిలించిన ధనముతో పారిపోవుచుండిరి. మేల్కొనినవారు కేకలు పెట్టిరి. శ్రీ ప్రభువులవారికి విన్నవించుకొనిరి. శ్రీ ప్రభువులవారు వారిని సముదాయించి, "నిదురపొండు నేను దొంగలను తగిన రీతిని శిక్షింతునని" అనతిచ్చిరి. సొమ్ము పోయిన వారికి ఏమియు అర్థము కాలేదు. ఏమిచేయవలెనో తోచక వారివారి స్థానములకు వెడలిరేకాని నిద్రపట్టలేదు. ఎట్లో తెల్లవారినది. నగర సమీపమున లోతైన గోతిలో నుండి ఆర్తానాదములు వినుపించుచుండెను. ఊరివారు పరుగు పరుగున వెళ్ళి చూడగా దొంగలు గుడ్డివారై పోయి ఆ గోతిలో పడియుండిరి. వారిని తీసుకొనివచ్చి శ్రీ ప్రభువులవారి ఎదుట హాజరు పరచిరి. వారు తమ తప్పు ఒప్పుకొని, ఏడ్చుచూ, కరుణించమని దీనాతి దీనముగా ప్రభువులవారిని ఆర్తితో ప్రార్థించిరి. శ్రీ ప్రభువులవారు కరుణా సముద్రులు అందరు నా బిడ్డలేకదా. వారిని మంచిమార్గమున పెట్టుటకు ఇట్లు చేసితిని. వారికి పశ్చాత్తాపము కలిగి ఇక సన్మార్గ వర్తుల గుదురు అని వారికి మరల నేత్ర దృష్టి కటాక్షించిరి. అందరును పరమానంద భరితులైరి. ఎంతటి కరుణ! ఎంతటి మహిమ! దొంగలు తాము దొంగిలించిన ద్రవ్యమును శ్రీవారి పాద కమలములచెంత పెట్టిరి. శ్రీ ప్రభువులవారు ఎవరిసొమ్ము వారికి అందచేసిరి.

"స్వామి!దత్తప్రభో! ఎంతటి కరుణాంతరంగుడవయ్యా! మేమందరము నీ బిడ్డలమే స్వామి! మా పాపములను త్రుటి కాలములో రద్దుచేయగల ప్రభువువునీవేగదా! అంచంచలమైన విశ్వాసము, భక్తిని అనుగ్రహించవయ్యా" అని ప్రణమి ల్లిదము.

శ్రీ ప్రభువుల వారి మహిమలు ఎన్ని చెప్పుకొనినను తనివి తీరదు. ఇప్పుడు మరియొక అద్భుతమును తిలకింతె దము గాక!

ఒకనాడు శ్రీ ప్రభువులవారు దర్బారులో యుండిరి. ఆ దర్బారులో అనేకమంది హిందువులు, ముసల్మానులు, ఫకీరులు బైరాగులు యుండిరి. ఆ సమయమున భాంకి తాలూకా తహశీలుదారుగా పనిచేయుచున్న ఆబారావను ఉద్యోగి స్వామివారి దర్శనమునకు దర్బారుకు వచ్చెను. శ్రీ ప్రభువులవారు ఆయనను పలకరించి యోగక్షేమములడిగిరి. అప్పుడు ఆ తహశీలుదారు తాను హైదరాబాద్ వెళ్ళు చున్నాననియు, ప్రభుత్వము తాలూకు తహశీలు పైకం పదివేల రూపాయలు తీసుకొని వెళ్ళుచున్నాననియు మనవి చేసెను. ఆశ్చర్యము. ప్రభుత్వమునకు చెల్లించవలసిన పైకాన్ని శ్రీ ప్రభువులవారు తనకిమ్మని ఆజ్ఞాపించిరి. వెంటనే ఆబారావు తడుముకొనకుండా ఆ పదివేల రూపాయలు శ్రీ ప్రభువులవారి చరణములముందు కుమ్మరించెను. శ్రీ ప్రభువులవారు శ్రీ ఆబారావును, "ఇక నీవు మీ ఇంటికి వెళ్ళుము" అని ఆజ్ఞ ఇచ్చిరి. ఆబారావు పరమభక్తుడు. అన్నిటికి శ్రీ ప్రభువే యున్నాడను దృఢ విశ్వాసముతో శ్రీ ప్రభువులవారికి నమస్క రించి తిరిగి ఇంటికి వెడలిపోయెను. ఆబారావు చేసిన కార్యము అంతయును అక్కడేయున్న మరియొక ప్రభుత్వ ఉద్యోగి చూచెను. వెంటనే అతడు హైదరాబాద్ నవాబుకు ఫిర్యాదు చేసెను. నవాబు ఆ ఫిర్యాదు చూచి మండిపడి ఆబారావును సంకెలలువేసితీసుకొనిరమ్మనిగుర్రపు రౌతులకుఆజ్ఞయొసగెను.

అద్భుతము! ప్రభువులవారి మహిమ!! అదే సమయమున మరియొక్క ఉత్తరము వచ్చెను. అందు పదివేల రూపాయలకు హుండీలు ఖర్చులతో సహా జమ వచ్చియుండెను. నవాబు సంతోషించెను. వెంటనే నవాబు శ్రీ ఆబారావుకు ప్రమోషను ఇచ్చి మంచి శాలువను బహుకరించి రండని గుర్రపు రౌతులకు ఆజ్ఞ ఇచ్చెను. ఆబారావు కచ్చేరికి వెళ్ళుటలేదని తెలిసి శ్రీ ప్రభువువారు "భయపడవద్దు. కచేరికి వెళ్ళు" అని ఆజ్ఞ పంపిరి. ఆబారావు కచేరికెళ్లెను. అక్కడ తన ప్రమోషన్ ఉత్తర్వు, శాలువ బహుమానము ఎదురయ్యెను. అంతా శ్రీ ప్రభువుల కరుణా కటాక్షమని శ్రీ ఆబారావు సంతోషించెను ఆబారావుపై ఫిర్యాదు చేసిన ఉద్యోగిని నవాబు "బద్మాష్" అని నిందించి, ఉద్యోగమునుండి తొలగించెను.

శ్రీ మాణిక ప్రభువులవారు శ్రీ దత్తావతారులు. వారు శరీరముధరించిరే గాని, సర్వాంతర్యాములు. ఎక్కడ ఎప్పుడు ఏమి జరుగుచున్నది వారికి విదితమే. "నీవు చేయు ప్రతి పనిని నేను చూచుచుంటిని. నీవు తలచిన ప్రతి విషయము నాకు తెలియుచున్నది" నీవు పలుకు ప్రతి మాట నాకు వినిపించు చున్నది" ఇది శ్రీ దత్త దివ్యవాణి. శ్రీ ప్రభువులవారు అన్నిటయు ఇట్లే వ్యవహరించుచుండిరి.

హోమినాబాద్‌లో ఒక తుంటరి వాడుండెను. కష్ట కాలములో మొక్కులు మొక్కి, స్వామి అనుగ్రహము వలన కష్టము తీరినవారు సవినయముగా వచ్చి శ్రీ ప్రభువులవారికి మొక్కులు తీర్చుకొని వెడలు భక్తులను చూచి ఈ తుంటరి వాడు ఎగతాళి చేయుచుండెను. ఒకరోజు వాని కాలి ఒక

చెప్పు కనిపించలేదు. ఆ తుంటరి దుర్బుద్ధితో ఎగతాళిగా ఇట్లు మొక్కెను. "నా కాలిజోడు దొరికినచో శ్రీ మాణిక ప్రభువుల వారికి ఒక దమ్మిడి (పైసా) పంచదార సమర్పింతునని మొక్కెను. ఆ తర్వాత వాని జోడు దొరకెను. అప్పుడు ఆ తుంటరి శ్రీ ప్రభువులవారికి దమ్మిడి పంచదార మ్రొక్కితిని గదా! దమ్మిడి పంచదార ఇస్తే అందరూ నవ్వుతారు అనుకొని పావలా (25 పైసలు) పంచదార కొని పొట్లం కట్టుకొని వెళ్ళి శ్రీ ప్రభువులవారికి సమర్పించెను. అప్పుడు శ్రీ ప్రభువుల వారు ఆ పొట్లమును తెరువమని చెప్పి, అందు ఒక దమ్మిడి పంచదార మాత్రమే స్వీకరించి, నీవు మ్రొక్కినది ఒక దమ్మిడి పంచదారయే కదా! మిగిలినది నీవే తీసుకొనిపొమ్మని తిరిగి ఇచ్చివేసిరి. అప్పుడు ఆ తుంటరి సిగ్గుపడి, ఎంత తప్పు చేసితి నని, లెంపలు వేసుకొని అప్పటినుండి తుంటరితనము వీడి, సత్పురుషుడయ్యెను.

ఎంతటి మహిమ!

నృశింహరాయలను ఒక బ్రాహ్మణుడు విరాగియై కాశీకి పోవుచూ మార్గమధ్యమున కీకారణ్యము గుండా ప్రయాణము చేయుచుండెను. ఇంతలో రాత్రియైనది. గాలివాన పడుచుండెను. నరశింహరాయలు భయముతో వణుకుచూ దైవ ధ్యానము చేయుచుండెను. ఎట్లో తెల్లవారినది. అచ్చట ఒక యోగి దర్శనమిచ్చెను. "నీవు దత్తాత్రేయ భగవానుని, ఏకాగ్ర బుద్ధితో కొలువుము. సౌఖ్యమును పొందగలవని" ఆ యోగి సెలవిచ్చెను. ఆ మాటలు వినక, నరశింహరాయలు తనకు

కాశీకి పోవు మార్గము చూపుడని పట్టుపట్టెను. అప్పుడు ఆ యోగిపుంగవుడిట్లనెను. "నాయనా! వినుము. ఇచ్చటకు కొంత దూరమున మాణిక్య నగరమున్నది. త్రోవలో విరజయను నది యున్నది. ఆ నదిలో స్నానముచేసి, మాణిక్య నగరమునకు పొమ్ము. అక్కడ అన్నపానాదులు దొరకును. అచ్చటనుండి కాశీకిపోవు మార్గము లభించునని చెప్పి వెడలిపోయెను. అత డట్లు చేసెను. అదృష్టము. అచట శ్రీ ప్రభువులవారు నరశింహ రాయలకు శ్రీ దత్త మంత్రోపదేశము చేసి పాదుకలు, జోలి, సటకా ఇచ్చి, నీవు రామేశ్వరము వెళ్లుమని ఆజ్ఞ ఇచ్చిరి. అత డట్లు చేసి శ్రీ దత్తానుగ్రహమును పొంది కృతార్థుడయ్యెను.

శ్రీ దత్త ప్రసాద మహిమను తెలుపు ఈ సంఘటన చాలా అద్భుతము. ఆ రోజులలో కాశీయాత్ర బహు కష్ట తరమై యుండెను. కాశీకి పోయినవాడు కాటికి పోయినవాడు సమానమే అను సామెతకూడ గలదు. ఒక బీద బ్రాహ్మణ దంపతులు కాశీ వెళ్ళ సంకల్పించిరి. శ్రీ ప్రభువులు కరుణా మయులు దానకర్ణులు అని విని వారివద్దకు వచ్చిన కొంత పైక మిత్తురను ఆశతో ఆ దంపతులు శ్రీవారిని దర్శించిరి. శ్రీ ప్రభువులవారు, వారిని యోగక్షేమములడిగి వచ్చిన పని తెలుసు కొని, శిష్యుల పిలచి సరుకు ఏమున్నదో చూచి రండరిని. శిష్యులు తిరిగివచ్చి ప్రభూ! సరుకులు నిండుకున్నవి అని బదులు చెప్పిరి. అప్పుడు శ్రీ ప్రభువులవారు — ఏది ఉంటే అదే తెండని ఆజ్ఞ ఇచ్చిరి. శిష్యుడు తిరిగి వచ్చి ప్రభూ. గుప్పెడు మినుములు మాత్రము కలవని శ్రీవారికి సమర్పించెను! శ్రీ ప్రభువులవారు వానిలో కొన్ని మినపగింజలు తీసి,

వాటిలో కొన్ని పుష్పములు, కొన్ని ఖర్జూరఫలములు పెట్టి ఒక చిన్న పేటికలో బంధించి ఆ బ్రాహ్మణ దంపతులకు ప్రసాదించి, క్షేమముగా సుఖముగా వెళ్ళి రండని ఆశీర్వదించిరి. ఆ పేద బ్రాహ్మణదంపతులు శ్రీవారి ప్రసాదము తీసుకొనిరే గాని, మనస్సు తృప్తి పొందలేదు. శ్రీ ప్రభువులవారు వలయుపైకము నిచ్చెదరను కొంటిమని మనస్సులో అనుకొని, శ్రీ ప్రభువులవారి శలవుగైకొని కాశీకిబయలుదేరిరి. ఆశ్చర్యము. ఈ దంపతులు మాణిక్యనగరము దాటిననాటి నుండి కాశీకి వెళ్ళి, మరల మాణిక్యనగరము తిరిగి వచ్చువరకు వారికి ప్రతిరోజు ఎవరో ఒక దంపతులు వీరిని ఆహ్వానించి, సత్కరించి, భోజన, శయన సదుపాయములుచేసి గౌరవవించు చునే యుండిరి. కాశీయాత్ర సలక్షణముగా పూర్తిచేసుకొని ఈ బ్రాహ్మణ దంపతులు శ్రీ మాణిక్యనగరము చేరుకొనిరి. శ్రీ మాణిక్యప్రభువులవారి దర్శనభాగ్యమయ్యెను. శ్రీవారు పరామర్శించిరి. బ్రాహ్మణదంపతులు కృతజ్ఞతలు చెప్పుకొని వెడలి పోవుటకు అనుజ్ఞకోరిరి. ఆశ్చర్యము! శ్రీ ప్రభువుల వారిట్లనిరి. "నాయనా! మీరు కాశీకివెళ్ళేరోజున మీకు ప్రసాద మిచ్చితినిగదా! ఆపేటికఇట్లువ్వుము." అనిరి. బ్రాహ్మణుడు తనమూటలోని పేటికను శ్రీవారికి సమర్పించెను. శ్రీ ప్రభువుల వారు పెట్టితెరచి అందలి మినపగింజలను వాసనచూచి అవతల పారవేసిరి. "నాయనా! ఇక మీరు మీ గ్రామమునకు వెళ్ళ వచ్చు"ననిరి. బ్రాహ్మణ దంపతులు మాణిక్యనగరముదాటి వారి గ్రామమునకు వెళ్ళువరకు కనీసము ఒక్కచోట కూడా వారికి ఆతిథ్యము దొరకలేదు. ఆహా! శ్రీదత్త ప్రభువుల ప్రసాదమహిమ ఎంతటి విశేషము అనిగ్రహించిరి. శేష జీవితము దత్తసేవలో నిమగ్నులై జీవన్ముక్తులైరి.

మరియొక అద్భుతము. చెరుకుగడ నమిలినకొలదీ తియ్యనిరసము వచ్చుచునే యుండును. కొబ్బరి నమిలిన కొలది రుచి అధికమగును ద్రాక్షపండునోటిలో వేసుకొనగానే మధురిమ కాన్పించును. శ్రీ దత్తావతార గాథలు వినినకొలదీ వినవలయునను తపన అధికమగుచుండును. శ్రీ మాణిక్య ప్రభువులకు అరబ్బీభాషరాదనియు, కురాన్‌లో ఏమిచెప్పబడి యున్నదో వారికేమి తెలియుననియు, ఒక మనుజుడు మరియొక మనుజుని పూజించరాదని కూరానులో చెప్పబడి యుండగా ఈ వ్యక్తి పూజలేమి? అని ఐనుద్దీన్ అనుముస ల్మాను ఉపాధ్యాయుడు తనకు కూరాను బాగావచ్చునను విద్యాగర్వముతో శ్రీ మాణిక ప్రభువులవారిని తూలనాడు చుండెను. ఒకనాడు రామక్రిష్ణపంతు అనుభక్తుడు వారి బంధువులతో మాణిక్యనగరమునకుపోవుచుండెను. అని విని ఐనుద్దీన్ గూడ బయలుదేరెను. వీరి ఉద్దేశ్యము శ్రీ ప్రభువుల వారిని అగౌరవపరచవలయుననియే తప్ప, ప్రభుసేవగాదు.

అందరితోపాటు శ్రీ ప్రభువులవారి దర్శనముచేసు కొనెనేగాని, శ్రీవారిని ఎప్పుడు దూషింతునా? అని వీరి ఊగిసులాట. కొంత తడవుకు శ్రీవారితో మాట్లాడే అవకాశము కలిగెను. వెంటనే ఐనుద్దీన్ ఇట్లనెను. ప్రభూ! ఒకమనుజుడు మరియొక్క మనుజుని దైవముగా పూజించుట మహాపాపము గదా. కురానులో ఏమివ్రాసియున్నదో చూతుడు" అనికురాను లోని ఒక వాక్యమును చదివి వినిపించెను. శ్రీవారు మంద స్మితవదనులై ఇట్లనిరి. "భాయీ! నీవు చెప్పినది సత్యమే కాని కురానులోని ఈ వాక్యములు చూడుము" అని స్వామి

వారు ఐనుద్దీన్ చూపిన వాక్యములకు విరుద్ధములైన ఎనిమిది వాక్యములు చూపిరి. ఐనుద్దీన్ నిశ్చేష్టుడైయ్యేను. ఆయన విద్యా గర్వము నశించెను. చెమటలు పట్టెను. స్వామి వారి పాదముల వ్రాలెను. "ప్రభూ! కరుణించుమని" వినయ వినమ్రుడై ప్రార్థించెను. స్వామి కరుణించిరి అప్పటి నుండి ఐనుద్దీన్ ప్రభుభక్తిపరాయణుడై శ్రీ మాణిక ప్రభువులే పరబ్రహ్మమని దేముడొక్కడెనని చాటు చుండెడివాడు. ఎంత వింత భగవాన్ శ్రీదత్తాత్రేయ స్వామివారు మార్గశిర శుద్ధ పూర్ణిమనాడు శ్రీ అత్రి అనుసూయల పుణ్యఫలముగా ఆవిర్భవించి సకలసృష్టిని పులకింప చేశారు. ఆ పుణ్యదినమే శ్రీదత్త జయంతి. శ్రీమాణిక ప్రభువులవారు సాక్షాత్తు దత్తావతారులే కదా. మాణిక్య నగరమున శ్రీ దత్త జయంతి ఉత్సవము ఆడంబరముగా జరిగెడిది. గాదీకి పూజ, పాదుకల అభిషేకార్చనలు జరిగెడివి. భజనలు, కీర్తనలు, హరికథలు, నాట్య ప్రదర్శనములు జరుగుచుండెడివి. హిందువులు,ముసల్మానులు అన్నదమ్ములవలె కలిసిమెలిసి ఉత్సవములలో పాల్గొను చుండిరి. ముసల్మానుల మత గ్రంథములో మహబూబ్ సుభానీవారి జీవిత చరిత్ర ప్రశంసించబడినదట. వారి జీవిత చరిత్ర శ్రీ దత్త ప్రభువుల చరిత్రఒకే పోలిక గలిగియున్నవట. మహబూబ్ సుభానీవారే శ్రీ దత్త భగవానులని ముసల్మానులు తలచెడివారు.

శ్రీ ప్రభులవారు దీనదయాళువు. సర్వశక్తి సంపన్నుడు. విరాగి స్మర్తృగామి. భోగమోక్షప్రదుడు. అన్నిమతస్థులవారిని తారతమ్యము లేక సమదృష్టితో చూచెడివారు. భక్తుల అర్తిని పొగొట్టెడి దయామయుడు.

శ్రీ మాణిక ప్రభువులు 1865 సం॥ మార్గశిర శుద్ధ ఏకాదశి దినమున తెరచాటు అగుటకు సంకల్పించిరి. ఈ విషయము అతి రహస్యముగా యుంచ సంకల్పించిరి. తన ముఖ్య శిష్యులను నలుగురిని దగ్గరకు పిలిచిరి నాయనలారా! ఈ అవతార కార్యము సంపూర్ణము కావచ్చుచున్నది. నేను అవతారము చాలించ సంకల్పించితిని. దీనిని అతిరహస్య ముగా యుంచుడు. నేనున్న కుటీరము లోపల ఒక గొయ్యిని తవ్వించండి. దానిలో కూర్చునుటకు తగినట్లు ఏర్పాటు చేయ మని ఆజ్ఞాపించిరి. ఆ ఆజ్ఞను వినిన శిష్యుల గుండెలు గుబేలు మనెను. కళ్ళవెంట నీరు గిర్రున తిరిగెను. కంట నీరు జలజల రాలెను. పెద్ద పెట్టున ఏడ్వలేక గుండెలు కుదించుకుపోవు చుండెను. ప్రభూ! ప్రభూ! అని వారినోట హీనగద్గదశబ్దము వచ్చుచుండెను. ప్రభువులవారు శిష్యులను ఊరడించిరి. శిష్యులు ఎట్టకేలకు ఎటులనో తేరుకొనిరి. ప్రభువులవారి ఆజ్ఞను శిరసావహించిరి. ప్రభువుల ఆజ్ఞమేరకు ఈ విషయము బయటకు పొక్కనీయలేదు. సమాధి మందిరమును ప్రభువుల వారి కుటీరములోనే గొయ్యి తవ్వించి ఏర్పాటు చేయబడినది. సమాధి దినమునకు ఒక రోజుముందు అపూర్వమైన దర్బారు జరిపించి శ్రీ ప్రభువులవారు ఎల్లరకు దర్శన భాగ్యమొసంగిరి.

శ్రీ ప్రభువులవారు దర్బారులో చాలా ఉల్లాసముగా దర్శనమిచ్చిరి. ఆ సందర్భములో అనేక దానధర్మములు చేయబడెను.

మార్గశిర శుద్ధ ఏకాదశి రానే వచ్చినది. శ్రీ ప్రభువుల వారు కుటీరములో ప్రవేశించిరి. ప్రభువుల ఆజ్ఞానుసారము

గొయ్యిముందరి భాగము మూసివేయబడినది. ఈ విషయము శుద్ధపూర్ణిమ వరకు రహస్యముగా ఉంచవలెనని ఆజ్ఞ అయినది. శ్రీవారి ఆజ్ఞమేరకు ఉత్సవములన్నియు జరుపుచుండిరి.

భక్తులు ఉత్సవములు తిలకించుటకు తండోప తండము లుగా వచ్చియుండిరి. శ్రీవారి దర్శనమునకు భక్తులు తహతహలాడుచుండిరి. శిష్యులు "శ్రీ ప్రభువులు విశ్రాంతి తీసు కుంటున్నారు. ఇదిసమయముకాదని" నచ్చచెప్పప్రయత్నించు చుండిరి. ఎట్లో ఆరోజు గడచెను. మరుసటి దినము రానే వచ్చెను. కుటీరము తొలగించబడెను. భక్తులు దిగ్భ్రాంతి చెందిరి. శ్రీవారి దర్శనము కలగనందున భక్తులు దుఃఖితులైరి. సత్యము బయటపడెను. ప్రభువులు ఇక వేరువేరు అని హిందు వులు, ముసల్మానులు కూడా భోరున ఏడ్వసాగిరి. వారి దుఃఖమునకు అవధులు లేకపోయెను. కొందరు నేలమీద పడి దొల్లుచుండిరి. సర్కారు ఉద్యోగులు, శిష్యులు శ్రీ ప్రభువుల వారి ఆజ్ఞను ఎల్లరకు తెలియపరచి సముదాయించిరి.

శ్రీ ప్రభువులవారు భౌతిక శరీరమును సమాధి చేసిరే కాని, వారి దివ్య దర్శనము సర్వకాల సర్వావస్థలయందును సద్భక్తులకు లభించుచునే యుండెను.

శ్రీ దత్తావతారులైన శ్రీ మాణిక ప్రభువులవారి చరిత్రను పఠించి తరింతుముగాక అని మనవి.

ఓం తత్ సత్

## స్వామి సేవలో పాల్గొనమని ఆదేశమిచ్చుట

**6–12–95** మార్గశిర శుద్ధ పూర్ణిమ-దత్త జయంతి-శ్రీ దత్తవాణి. శ్రీవారి అనుగ్రహ సంభాషణము-సారము.

చెప్పవలసినదంతయు చెప్పియుంటి
చెప్పవలసిన దింక నిశ్శేషమగును
చేయవలసినదెంతయో శేషమగుట
చేయవలసిన దానిలో సాయపడుము.

నాయనా! నేను సత్యమును చెప్పుచున్నాను. నా మాట విశ్వసించుము. ఈ **84** కోట్ల జీవరాసులు నా బిడ్డలే కాన నీకు సోదరులై యున్నారు. ఈ ప్రాణులందరిచేతను సాధన చేయించి సిద్ధికి చేర్చుట నాకున్న గాఢమైన ఒకే ఒక కోరిక. ఈ కార్యమున నీవును పాల్గొన్నచో నీ సోదరులకు సాయ పడుటయేగాక, నీ తండ్రికి ఎంతో ఆనందమును చేకూర్చిన వాడవగుదువు. కావున నా సందేశములను ప్రచారము చేసి ఇతరులను ఉద్ధరించుటయే ఇక నీవు చేయవలసిన పని. నీవు ప్రచారము చేయవలసిన సాధనయొక్క సారాంశము ప్రేమ యొక్క పరాకాష్ట తత్త్వమే. అది యొక్కటియే నన్ను చేరుటకు మార్గము. ఆ ప్రేమ పరాకాష్టలో సాధకుడు ధర్మ మును కూడా అతిక్రమించవలెను. ధర్మము నాకన్న గొప్పది కాదు. అట్లు ధర్మమును అతిక్రమించుట చేత ధర్మముకన్నను నాకు గొప్ప స్థానమును ఇచ్చుటచేత ప్రేమ పరాకాష్ట వ్యక్త మగును.

అనసూయను, సుమతిని, వ్రేపల్లెలో మునిపత్నులను ఇట్టి పరీక్షలకే గురిచేసి ధర్మము నాకన్న గొప్పదా? ధర్మము కన్న నేను గొప్పవాడినా? అను ప్రశ్నలకు గురిచేసి యున్నాను. ధర్మముకన్న నాకే గొప్ప స్థానమును ఇచ్చి అనసూయ సుమతి నన్ను పుత్రునిగా పొంది లాలించి ఆ మహదానందముతో తరించిరి. అట్లే మునిపత్నులను వారి భర్తలు ఆగ్రహించినను వినక ధర్మముకన్న నాకే గొప్ప స్థానమును యిచ్చి పూర్ణాహుతి చేయక మునుపే నాకు భోజన మిడి తరించిరి. అట్లే రాధయు, మీరాయును నా కొరకు ధర్మ మును అతిక్రమించిరి. ప్రేమ పరాకాష్ఠలో సుఖము లభించక పోగా కష్టములు, అవమానములు, దారుణహింసయు లభించి నను, నన్ను విడనాడకుండుటయే నా పరీక్షలో నెగ్గుట. దారుణమైన శత్రువును కూడా నీవు ప్రేమించ కలిగిననాడు, పరీక్షా సమయములో స్వామి నీకు దారుణ శత్రువుగా నటించి నపుడు ప్రేమ ఏమాత్రము తగ్గకుండా స్వామిని ఆరాధించ కలుగుదువు.

ప్రేమలో ఏమాత్రము స్వార్థమున్నచో అట్టి దివ్య ప్రేమ లభించదు. ప్రతిజీవుడును ఇతర వస్తువులను, ఇతర వ్యక్తులను తన స్వార్థమైన సుఖమునకు ప్రేమించుచున్నాడే తప్ప తన స్వార్థము ఏమాత్రము లేక కేవలము వారి సుఖము నకే ప్రేమించుటలేదు. అందువలన వీటిని ప్రేమలు అనరాదు. ఇవి అన్నియు స్వార్థములే. నాకు ఒకసారి శిరోవేదన వచ్చి నట్లు నటించితిని. నా భార్యలెవరును ఆ శిరోవేదన పోవుటకు తమ పాదధూళిని నారదమునికి ఇవ్వలేదు. అట్లు ఇచ్చినచో

నరకమున పడి నరక బాధలను అనుభవించవలసి వచ్చును. అను భయముచేత అనగా స్వార్థముచేత ప్రవర్తించిరి. కాని గోపికలు మాత్రము, నా శిరోవేదన తగ్గుటయే ప్రధానము కానివారు అనుభవించవలసిన నరకబాధను తృణప్రాయముగ లెక్కకట్టి పాదధూళిని ఇచ్చియుండిరి. శ్రీ దత్త పరీక్షలో ఇట్లు అతి సూక్ష్మాతి సూక్ష్మములుగా యుండును. అవి అశిధారా వ్రతము అనగా కత్తి అంచుపై నడక కావున ఈ సాధన సారాంశమును ప్రచారము చేసి పతితులగు నీ సోదరులను అనగా నా బిడ్డలను ఉద్ధరించు. తండ్రికి ప్రయోజకుడైన పుత్రునిపై దృష్టియుండును. పతితుడైన పుత్రునిపైననే విశేష ముగా దృష్టియుండును. అంతమాత్రమున నీపై నాకు ప్రేమ లేదనియు లేక తగ్గినదనియు కాదు. నీవు నాకు తండ్రికి జేష్ఠ పుత్రునివలె సాయము చేయుచు, నా అంతవాడవని అర్థము. నీపై ప్రేమ నాకు తగ్గినచో నాపై నాకు ప్రేమ తగ్గినట్లే గదా! తన్నుతాను ప్రేమించుకొననివాడు ఎక్కడైనా ఉండునా?

కావున జేష్ఠః పితృ సమోభ్రాతా. అనగా జేష్ఠ కుమారుడు తండ్రితో సమానమైనవాడని శాస్త్రము. అందువలన ఈనాటినుండియు పూర్ణ తృప్తితో పూర్ణ శాంతితో నా ఆదేశ ములను పాటించి పతితులైన అన్య సోదర జీవులను ఉద్ధరించు కార్యక్రమమున పాల్గొనుము. నీవెన్ని జన్మలెత్తినను చేయ వలసినది ఇదియే. నేను ఎన్ని అవతారములనెత్తిననూ కూడా చేయవలసినది ఇదియే కదా! ఇది ఈనాటి దివ్యవాణి."

అని వచించారు స్వామి. స్వామి ఆదేశము శిరోధార్యము స్వామీ! అనుగ్రహించవయ్యా! అని ప్రణమిల్లుదము.

# శ్రీ ద త్త ది వ్య వా ణి

ఉపనిషత్తులలో, బ్రహ్మసూత్రములలో, భగవద్గీతలోను ప్రస్తుతించబడిన బ్రహ్మము నిజముగా శ్రీదత్తాత్రేయగురు దేవుతే అని నిశ్చయముగా విశ్వసించవలయును. దీనికి కారణము ఏమనగా, ఆ గ్రంథములలోనే బ్రహ్మమును గుర్తించు లక్షణము "ఒకే ఒక వస్తువైన బ్రహ్మము ఈ జగత్తును సృష్టించి, పాలించి, నశింపచేయుచున్నది." అని చెప్పుచున్నది. తన త్రిముఖముల ద్వారా ఈ మూడుపనులను చేయు ఏకైక వ్యక్తి తానేనని ప్రత్యక్షంగా నిరూపించుచున్న శ్రీ దత్తభగవానుడే బ్రహ్మమనటలో సందేహమేమున్నది?

అయితే, బ్రహ్మము నిర్గుణమనబడు నిరాకారమని అద్వైతులు, నారాయణుడనివిశిష్టాద్వైతులు, శివుడని శైవులు, శక్తియని శాక్తేయులు, బ్రహ్మదేవుడని కార్యబ్రహ్మవాదులు, ఇతరదేవతలని ఆయా మతములు వాదించుచున్నారు. నాస్తికులు అసలు బ్రహ్మము అనగా గొప్పది అనీ, కావున ఈ కనిపించు విశ్వమే బ్రహ్మమనియు వాదించుచున్నారు. నాస్తికుల మతమును ఖండించి ఆస్తికుల మతమును సమన్వయము చేయవలయును.

నాస్తికమతమును ఖండించుటకై శ్రీదత్తప్రభువు ఈ లోకమున ప్రతిమనుష్యతరములోను ఆయా అవతారముల ద్వారా అవతరించి తన అద్భుతశక్తులను ప్రదర్శించి తాను ఉన్నానని ప్రత్యక్షముగా నిరూపించుచున్నాడు. ఇది నాస్తికుల ఖండనమేకాన ప్రత్యక్ష విశ్వాసులగు వారికి ప్రత్యక్షముగానే తన ఉనికిని నిరూపించి, తనను విశ్వసించి ఉపాసించి తరించమని, చెడిపోయిన తన బిడ్డలను వారిపై అధిక వాత్సల్యముతో వారిని శిక్షించక, వారికిని సకల భోగభాగ్యములనిచ్చుచున్నారు. అపార కరుణా సాగరులకు శ్రీదత్తదేవులు! స్వామివారి అద్భుత మహిమలను ఇంద్రజాలములని అపహసించు నాస్తికులుగ్రహించవలసినవిషయముఏమనఇంద్రజాలము ముందుగా కొన్ని ఏర్పాట్లతో చేయబడియున్నందువలన, ఇంద్రజాలములో ప్రదర్శించు అద్భుతశక్తులు మోసములే. కానీ శ్రీదత్త భగవానుని అవతారములు అట్లు ఏర్పాట్లు ముందుగాలేక ఎక్కడనైనను ఎప్పుడైనను ఈ మహిమలను ప్రదర్శించుచున్నారు. కాన, ఇవి ఇంద్రజాలములు కావు.

ఇక ఆస్తికులు తమతమ అనుభూతులను మతములుగా ప్రకటించియున్నారు. వీటినన్నింటిని ఒకచోట చేర్చి సమన్వయము చేసినచో పరిపూర్ణమై సిద్ధాంతము లభించును. కాన

ఆస్తికుల నెవ్వరినీ ఖండింపపనిలేదు. ఏనుగుకాలు, తొండము తోక, పొట్టపట్టుకున్నవారు తమ తమ అనుభూతుల ప్రకారముగా ఏనుగు ఇట్లున్నది. ఇట్లున్నది. అన్నారే తప్ప ఏనుగు లేదనలేదుకదా. వీరి అనుభూతులలో దేనిని నిరాకరించినా మనకు, కాలో తొండమో, తోకో, కడుపో, లేని ఏనుగుయే సిద్ధించును కాన పరిపూర్ణ మతముకాదు. ఆస్తికుల మతము లన్నింటినీ సంకలనము చేసి సమన్వయము చేసినచో సర్వావయములతో పరిపూర్ణమైన ఏనుగు సిద్ధించినట్లు పరిపూర్ణ మతము లభించును.

అస్తికులలో ప్రధానులు అద్వైతులు, విశిష్టాద్వైతులు. ద్వైతులు- ఈ ముగ్గురిని సమన్యయముచేసినచో మిగిలిన వారిని సులభముగా సమన్వయము చేయవచ్చును.

అద్వైతులు చెప్పు అమూర్తము బ్రహ్మము. ఇది వ్యక్తి యొక్క సామర్థ్యము వంటివి. విశిష్టా అద్వైతులు, ద్వైతులు చెప్పునది మూర్తము స్వామియే ఇది వ్యక్తి వంటిది. వ్యక్తికి సామర్థ్యానికి అబేధముకాన ఇరువురూ చెప్పునది ఒక్కటియే.

మూర్తా మూర్తములు రెండునూ ఒక్కటియే అభిన్నములు.

శ్రీ జన్నాభట్ల
వేణుగోపాల కృష్ణమూర్తి
దత్త భక్తులు-

# శ్రీ దత్తస్తుతి గీతం

దత్త దత్త ముఖేమాణ దత్త దత్త ముఖేమాణ
దత్త గోవిందహో॥

1. శ్రీపాద వల్లభ దిగంబరాచ
మంత్రజపావా నిత్యహో॥
దత్త దత్త ముఖేమాణ॥

2. దత్తరూపాల। నిత్య స్మరావే।
మనాతనేతే। ఘటునీయావే।
బ్రహ్మవిష్ణు ఆణిమహేశ్వర।
ఏసజివాతె ధీయాతావే।
దత్త శ్రీరామహో! దత్త శ్రీకృష్ణహో! దత్త గోవిందహో
దత్త దత్త ముఖేమాణ॥

3. మదమోహన జింకుని ఆవా।
దత్త యోగిహో లాభజగా।
సంకటతారీ దేవానిహో।
మంత్రగురుచా హృదయీస్మరణ।
దత్త శ్రీరంగహో। దత్త విఠలహో। దత్త గోవిందహో
దత్త దత్త ముఖేమాణ॥

4. శక్తి గురూంచి అసతాపాఠీ
జణుదేవాసీ గడలీనాతీ
పావులకోఠె అచోహి జగతి
భక్తాచారే గురు సాంగాతీ
దత్త గణేశహో దత్త శంకరహో దత్త గోవిందహో
దత్త దత్త ముఖేమాణ॥

## శ్రీ గురుదత్త
## ఏకాదశ సూత్రములు

1. ఏ పనినైనను ప్రారంభించుటకు ముందు శ్రీ దత్త భగవానుని ధ్యానము చేయవలెను.

2 మహావృక్షము బీజములో ఇమిడియుండునట్లు, భగవానుని యందు సర్వజగత్తు ఇమిడియున్నది. సంకల్ప మాత్రముచేతనే స్వామి సృష్టి, స్థితి, లయములు చేయుచున్నారు.

3. దృఢ విశ్వాసము యుండవలెను. విశ్వసించిన అంతా గలదు. అనుమానించిన ఏమీలేదు. కనుక విశ్వాసము సడలరాదు.

4 స్వామి అద్వితీయుడు అఖండుడు. సర్వవ్యాపకుడు. అంతర్యామి, సర్వశక్తి సంపన్నుడు.

5 మహనీయుల జీవితములు అద్భుతములతో నిండియుండును.

6. మనబుద్ధికి మించిన పనులెల్ల నద్భుతములుగనే కనిపించును.

7. ఎట్టి అవతార పురుషులైనను, ప్రపంచములో జన్మించిన పిమ్మట దేహ ధర్మము ననుసరించియే వారివారి పనులను చేయుదురు.

8. సమగ్ర ఐశ్వర్య, శౌర్య, యశః, లక్ష్మి, జ్ఞాన, వైరాగ్యములు
1 2 3 4 5 6

ఈ ఆరు గుణములను "భగ" యనబడును. ఇవియే షడైశ్వర్యములు.

9 నిజమైన ప్రభువు ఈశ్వరుడు తప్ప, మరి ఎవ్వరూ లేరు.

10. పరమేశ్వరుడు భక్తులయొక్క కోర్కెలను దీర్చుటలో కల్ప వృక్షము వంటివాడు.

11. నిరంజనుడు, నిర్గుణుడు, నిరాలంబుడు, జ్ఞాన వైరాగ్య ఐశ్వర్య ఔదార్యములు కలవాడు, పరిపూర్ణుడు, శాశ్వతముగ సర్వకాలము లందుండువాడు-పరమేశ్వరుడు.